# శాంతి

# ఎలా స్థాపించబడుతుంది?




111

Aman Kistarah Qayam Hosaktha Hai?
(Telugu)

# శాంతి
# ఎలా స్థాపించబడుతుంది?

మూలం:

**మౌలానా హబీబుల్లాహ్, సయ్యిద్ హామిద్ హుసైనీ**

అనువాదం:

**అబ్దుల్ వాహెద్**

HYDERABAD

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**SHANTI YELA STHAPINCHABADUTUNDI?**

Aman Kistarah Qayam Hosaktha Hai? (Telugu)

**TIP Series No. 111**

| | | |
|---|---|---|
| Author | : | Maulana Habeebullah,<br>Syed Hamid Hussaini |
| Translator | : | Abdul Wahed |

All Rights Reserved with Publishers

| | | |
|---|---|---|
| 3rd Edition | : | March 2017 |
| Copies | : | 1000 |
| **Price** | **:** | **Rs.30** |
| ISBN | : | 81-88241-06-7 |
| Published by | : | Telugu Islamic Publications<br>Sandesha Bhavanam,<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500 002. India.<br>Phone: 24564583 |
| Typeset by | : | Geeturai Graphics<br>Lakkadkot, Hyderabad-2. |
| Printed at : | : | Cosmic Printers<br>Lakkadkot, Hyderabad-2. |

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# నేటి రాజకీయ వ్యవస్థ : దాని ప్రభావాలు

**(1951 ఏప్రిల్ 21న రాంపూర్‌లో జరిగిన జమాఅతె ఇస్లామీ హింద్ అఖిల భారత మహాసభలలో మౌలానా హబీబుల్లాహ్ (రాంచి) చేసిన ప్రసంగ పాఠమిది.)**

ప్రియ సోదరులారా!

ప్రారంభంలోనే నేను ఒక మాట స్పష్టం చేయాలనుకొంటున్నాను. నా ప్రసంగం ఏదో ఓ ప్రత్యేక జాతి లేదా తెగ లేదా దేశం కోసం కాదు. నా మాటలు అందరి కోసం ఉన్నాయి. అందరికీ ఒకే విధంగా వర్తిస్తాయి కూడా. భారతీయులైనా, పాకిస్తానీయులైనా లేదా మరే దేశంలో ఉన్నవారయినా సరే అందరికీ ఒకే విధంగా చెప్పబడ్డాయి. మేము ఓ సిద్ధాంతాన్ని, ఓ సంపూర్ణ జీవన విధానాన్ని ప్రతిపాదించే సందేశ ప్రచారానికి పూనుకొన్నాము. వర్గ, వర్ణ విచక్షణకు అతీతంగా సర్వమానవాళి సంక్షేమం కోసం అవసరమైన సందేశంగా మేము దీన్ని సమర్పిస్తున్నాం. అందువల్ల నేను మీతో కోరేదేమంటే, ఈ సందేశం ఏదో ఓ ప్రత్యేక జాతి వారి ప్రయోజనాల దృష్ట్యా ఉందని అనుకోవద్దు. ఈ సందేశాన్ని ఓ జీవన సంవిధానంగా అధ్యయనం చేయడానికి పూనుకోండి. ప్రశాంత చిత్తంతో ఈ సందేశాన్ని పరిశీలించండి-ప్రపంచవ్యాప్తంగా మానవాళి హింసాగ్ని కీలలలో మలమల మాడుతున్న నేటి పరిస్థితికి ఈ సంవిధానంలో చికిత్స ఉందా లేదా అని మీరే గంభీరంగా ఆలోచించండి.

సోదరులారా! నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులు అత్యంత తీవ్రమైనవి. సంక్షోభంలేని కోణం అంటూ ఏదీ మానవ జీవితాల్లో అగుపడడం లేదు. ఆందోళన, అలజడులతో నిండి ఉన్నాయి మానవ జీవితాలు. సామాజిక వాతావరణం అశాంతి మేఘాలతో క్రమ్ముకొని ఉంది. యావత్ ప్రపంచం

ఆందోళనాగ్రస్తమై ఉంది. ఈ ఆందోళనలు ఏ ఒక్క దేశానికో పరిమితమైనవి కావు. ఈ పరిస్థితి ఆసియా, యూరప్‌లకు మాత్రమే సంభందించినదీ కాదు. భారత దేశానికి మాత్రమే ఉన్న సమస్య కూడా కాదు. ప్రపంచంలో అలజడి, ఆందోళనలు లేని భూభాగమంటూ ఏదీ లేదు. పూర్తి మానవాళి నేడు అశాంతితో అలమటిస్తోంది, పరితపిస్తోంది. అందువల్ల ఈ సమస్యను ఏదో ఓ జాతి, తెగ లేదా దేశం లేదా ఏదో ఓ ఖండానికి సంబంధించిన సమస్యగా భావిస్తే పొరబాటు. అలా భావిస్తే మానవ విలువలను పరిహసించి నట్లవుతుంది. అందువల్ల ప్రస్తుత పరిస్థితిని చక్కబెట్టడానికి సంఘ శ్రేయోభి లాషులు నడుంకట్టి ముందుకు రావాలి. మనం ఎంతగా ప్రయత్నించినా సమస్యలు తగ్గడానికి బదులు మరింత పెరగడానికి కారణమేమిటో అన్వేషించాలి. ఈ విశ్వవ్యాప్త ఆందోళనలు, ఈ హింసాగ్ని కీలలు, ఈ స్మశాన వాతావరణం పట్ల చూపోపు వహించడం విజ్ఞులకు తగిన పని కాదు.

ఈ వినాశక స్థితికి, ఈ ఆందోళనలకు పరిష్కారం వెదకడం ఎంత అవసరమో, ఈ చెడులకు మూలకారణాన్ని అన్వేషించడం కూడా అంతే అవసరం. ఈ అన్వేషణ చేయకపోవడమంటే రోగగ్రస్తమైన నేటి మానవాళి పట్ల మనలో సానుభూతి లేనట్లే. ఈ కారణం వల్లనే నేడు ప్రపంచంలో మేధావులు, సామాజిక చైతన్యం కోరే శ్రేయోభిలాషులు ఈ సామాజిక పరిస్థితికి చికిత్స చేయాలని భావిస్తున్నారు. ఈ సమస్యలను నిర్మూలించడానికి అనేక పథకాలను రూపొందిస్తున్నారు. అయినప్పటికీ సమస్యల చిక్కుముళ్ళు విడివడడం లేదు, సరికదా మరింత బిగుసుకొంటున్నాయి. రోగబాధతో అలమటిస్తున్న వ్యక్తిని అలాగే వదిలేయడం మానవత్వం అనుపించుకోనట్లే సానుభూతితో ఏదో చికిత్సను- ఆ చికిత్స వల్ల రోగికి లాభం కలుగుతుందో, నష్టం వాటిల్లుతుందో పట్టించుకోకుండా వైద్యం చేయడం కూడా సరికాదు. మనలో నిజంగా సానుభూతి ఉంటే, రోగాన్ని నివారించే వైద్యం కొరకు ప్రయత్నం చేయాలి. రోగి బాధను నివారించగలిగే, అతడి వ్యధను తొలగించ గలిగే చికిత్సా విధానాన్ని అది ఎక్కడున్నా సరే, ఎలాగైనా సరే కనుగొనాలి. ఇక నేటి వ్యాధిగ్రస్థ సమాజానికి ఇంతవరకూ మనం చేస్తూ వచ్చిన చికిత్సా

పద్ధతి విషయానికి వస్తే మానవాళి కష్టాలు, సమస్యలు ఈ చికిత్సల ద్వారా పరిష్కృతం అయ్యేవి కావు. ఎందుకంటే రోగానికి మూలకారణం సరిగ్గా నిర్ధారించబడలేదు. పర్యవసానంగా సమస్యల నివారణో పాయాలు సరిగ్గా లేవు. ఈ వాస్తవం మనకు తెలిసిందే. సమస్యల నిర్ధారణలో మౌలిక లోటుపాట్లు, నివారణలో చేసిన పొరబాట్లను సవివరంగా మీ ముందుంచే వాడినే- కాని సమయం చాలా తక్కువగా ఉంది.

నిత్య జీవితంలో మనకు ఎదురవుతున్న దుస్సంఘటనలు, అలాంటి సంఘటనలను నివారించడానికి మనం తీసుకొంటున్న చర్యలు అందరికీ తెలిసినవే. అందువల్ల నేను కేవలం సూచనప్రాయంగా ఆ సంఘటనలను మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను.

సోదరులారా! సమాజంలో ఉన్న చెడులకు, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విధ్వంసాలకు కారణం మనిషి దారిద్ర్యమని, పేదరికమని, మనిషి బీదరికాన్ని అనుభవిస్తున్నప్పుడు అతను చెడు చేయడానికి వెనుదీయడని, నీతిబాహ్యతలో మునిగిపోతాడని, కొంత మంది అభిప్రాయం. అందువల్ల పేదరికాన్ని తొలగిస్తే నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అలజడులు, ఆందోళనలు సమసిపోతాయని వారి ఉద్దేశ్యం. నిజమే, పేదరికం, నిస్సహాయత అన్నవి మనిషిలోని మానవత్వాన్ని పతనం చేస్తాయన్నది నిజమే, అయితే నేటి ప్రపంచంలోని ఆందోళనకర పరిస్థితులకు పేదరికమే మూలకారణంగా భావించడం సబబుకాదు. ఎందుకంటే, ప్రపంచంలో భాగ్యవంతమైన దేశాలలోనూ ప్రజలు బాధపడుతున్నారు. నిత్యావసరాల గురించి సంపన్న దేశాలలోనూ అనేక రకాల చెడులు తలెత్తి, ఆందోళనకర పరిస్థితులకు కారణభూతమవుతున్నాయి. అమెరికాలాంటి సౌభాగ్యవంతమైన దేశం కూడా లెక్కలేనన్ని ఆంతరంగిక సమస్యలతో సతమతమవుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. సమస్యలకు కారణం పేదరికమే అయినట్లయితే, భోగభాగ్యాలతో తులతూగుతున్న దేశం లేదా జాతికి ఎలాంటి సమస్యలు ఉండరాదు. దూరదేశాల విషయం వదిలేద్దాం. దగ్గర నుంచి సమస్యను పరిశీలిద్దాం. పాకిస్తాన్, భారత్ దేశాలలో కేవలం పేదవాళ్ళు

మాత్రమేనా సమస్యలతో సతమతమవుతుంది? ధనికవర్గం ప్రజలు సుఖ శాంతులతో హాయిగా బ్రతుకుతున్నారా? ఇలా జరగడం లేదన్నది స్పష్టమే. మన అనుభవాలు, మన సమస్యలు గొంతెత్తి ఈ వాస్తవాన్ని ప్రకటిస్తున్నాయి. ఈ ఆందోళనలకు, అలజడులకు, సమస్యలకు, భయానక స్థితికి కారణం మరేదో ఉందని నినాదిస్తున్నాయి. అందువల్ల మానవాళి బాధలకు, సమస్యలకు కారణం పేదరికమని చెప్పడం ఉచితం కాదు.

కాగా, మరికొందరు విద్యలేని కారణంగా సమస్యలు పుడుతున్నాయని వాదిస్తున్నారు. ఈ వాదన కూడా బలమైంది కాదు. విద్యావిహీనతయే సమస్యలకు కారణమయినట్లయితే, విద్యా విషయికంగా ఉన్నత ప్రమాణాలను అందుకొన్న దేశమన్నా ఈ సమస్యల నుంచి విముక్తి పొంది ఉండాలి. ప్రపంచ దేశాల్లో కొన్నింట 80 శాతం, 90 శాతం విద్యావంతులున్న దేశాలు కూడా ఉన్నాయి. ఆ దేశాల్లో కూడా నానాటికీ సమస్యలు అధికం అవుతున్నాయి. అంతేకాదు, విద్యా విషయికంగా వెనుకబడిన దేశాలలో సమస్యలను చెడులను సృష్టించే ఆలోచనలు, ఆచరణలు కేవలం 50 శాతం ఉండగా, విద్యాగంధం వంటపట్టించుకొన్న దేశాల్లో ఈ శాతం 80 నుంచి 90 వరకు ఉంది. మన చుట్టుప్రక్కల ఉన్న పరిస్థితుల్ని పరిశీలిస్తే కేవలం విద్యావిహీనులే అకృత్యాలకు పాల్పడుతున్నరా లేక విద్యావంతులు కూడానా అన్నది మీకే తెలుస్తుంది. పైగా నిరక్షరాస్యులకన్నా విద్యావంతులైన పెద్దలే అధికంగా కనబడతారు. ఇటీవల భారత, పాక్ దేశాల్లో కరాళనృత్యం చేసిన ఆటవికతకు, పైశాచికతకు పూర్తి బాధ్యత నిరక్షరాస్యులదేనా? ఈ మారణహోమాన్ని సృష్టించడంలో ఉన్నత విద్యావంతులైన మేధావివర్గం హస్తం లేదా? నిరక్షరాస్యుల్ని, విద్యావిహీనుల్ని కీలుబొమ్మలుగా చేసి తమ ఇష్టం వచ్చినట్లు ఆడించిన ఆ పెద్దలు ఎవరు? ఈ మారణహోమానికి పథక రచన చేసినది విద్యాగంధం ఒంటపట్టించుకొన్న పెద్దలేనని ఆలోచించే వారెవరికైనా అర్థమవుతుంది. పరిస్థితి ఇలా ఉండగా మానవాళి సమస్యలకు విద్యా విహీనతయే కారణమని ఎలా చెప్పగలం? విద్యాహీనత, అజ్ఞానాలన్నవి సమాజానికి తీవ్ర వ్యాధుల వంటి వనడంలో సందేహం లేదు. కాని

విద్యాహీనతయే మానవాళి సమస్యలకు ఏకైక కారణంగా భావించడంలో ఔచిత్యం లేదు.

కాగా, మతం అన్నది సర్వసమస్యలకు మూలం అని మరికొందరు వాదిస్తారు. అందువల్ల మతాన్ని సమాజం నుంచి సమూలంగా పెకలించి పారేయాలంటారు. ఈ విషయమై నేను ఒకే ఒక ప్రశ్న అడగడం తప్ప మరేమీ చెప్పను. అయితే నేడు సామూహిక జీవితంలో మతం జోక్యం లేకుండా మతాన్ని తొలగించిన తరువాత కూడా సమస్యలు తొలగడానికి బదులు మరింత పెరగడానికి కారణమేమిటి? పైశాచిక ప్రవృత్తి, ఆటవిక ధోరణులు ఇంకా ప్రదర్శితమవుతున్నాయెందుకని? చరిత్రలో కంచుకాగడా పెట్టి వెదికినా కానరాని హీన సంఘటనలు నేటి మతాతీత సామూహిక జీవితంలో చోటుచేసుకోడానికి కారణమేమిటి? అలజడి, అల్లర్లు, అవిశ్వాస వాతావరణం, హింసాకాండలకు కారణం మతమే అయినట్లయితే, రెండు ప్రపంచ యుద్ధాలు ఏ కారణంతో జరిగాయి? నేడు మూడో యుద్ధ ప్రమాదం మన ముంగిట వాలుతుందన్న భయాలకు కారణమేమిటి? ఈ యుద్ధాలకు ఏ మతం కారణమయ్యింది? కొరియాలో జరిగిన దానికి కారణం మతోన్మాదమా! ఈ వాస్తవాల వెలుగులో ఆలోచిస్తే హింస, అలజడులకు పునాదులు మతం వేస్తుందని ఎవ్వరూ అనలేరు. ఇటీవలి చరిత్రలో భారతదేశ విభజన సందర్భంగా మతం సాకుతో హింసాకాండ, మత కలహాలు జరిగాయన్నది నిజమే. కాని, ఆ మత కలహాలకు బాధ్యత మతం మీద నెట్టడం అన్యాయమే అవుతుంది. ఎందుకంటే మతం అన్నది ఓ వ్యక్తి లేదా కొందరు వ్యక్తుల సమూహము చేసే ఆచరణలు, కర్మల పేరు కాదు. మతం అంటే సైద్ధాంతిక నియమాలు. విశ్వాన్ని సృష్టించిన దైవం తరపున మనిషికి మార్గదర్శకత్వాన్నియ్యడానికి అవతరించిన నియమాలవి. మతం పేరు మీద అల్లర్లకు, హింసాకాండకు ఎవరైనా పాల్పడితే ఆ బాధ్యత మతానిదనలేము. రక్తపాతాన్ని, ఆటవికతను, హింసోన్మాదాన్ని మతం గనుక బోధించినట్లయితే అప్పుడు అల్లర్లకు బాధ్యత మతానిదనవచ్చు. కాని, ఖుర్‌ఆన్‌లోగాని, హదీసుల్లోగాని, వేదాల్లోగాని, ఇలాంటి అల్లర్లను రెచ్చగొట్టే బోధనలున్నాయని

మతం గురించిన ఏ కొద్దిపాటి అవగాహన ఉన్నవారయినా సరే అనలేరు. ఇలాంటి పైశాచిక చేష్టలకు పాల్పడమని మతం చెప్పడం లేదే, మరి ఎవరో, ఏ కొందరు దుండగులో మతం పేరు మీద చేసిన అకృత్యాలకు మతానిదే బాధ్యత అనడం ఎక్కడి న్యాయం?

నేనింత వరకు చెప్పిన మాటల వల్ల ఒక్క విషయం స్పష్టంగా అర్థమై ఉంటుంది. నేటి సామాజిక రుగ్మతలకు కారణాలు ఫలానా, ఫలానా అని చూపడం పరిస్థితులు గురించి సరియైన అవగాహనలేకపోవడం అయినా అవ్వాలి, లేదా ప్రపంచ ప్రజలకు మతం అంటే వెగటు కలిగేలా చేయడానికి పథకం ప్రకారం జరుగుతున్న కుట్ర అయినా అవ్వాలి.

ఏది ఏమైనా, సామాజిక రుగ్మతలకు చూపబడుతున్న కారణాలు సరియైనవి కాకపోయినా, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అల్లర్లు, అలజడులకు కారణం ఏమిటి అన్న ప్రశ్న మాత్రం అపరిష్కృతంగానే ఉంది. నేటి ఈ సందర్భంలో సవివరంగా మాట్లాడే అవకాశం లేదు. మౌలికమైన కొన్ని అంశాలను మాత్రం మీ ముందు ప్రస్తావిస్తాను. మొదటి విషయం: ఈ సమస్య ఏ ఒక్క జాతికి లేదా తెగకు లేదా దేశానికి సంబంధించినది కాదు. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. అందువల్ల ఈ సమస్యకు మూలకారణం కూడా ప్రపంచవ్యాప్తంగా ఉండి తీరాలి. ప్రపంచంలో ప్రస్తుతం రాజ్యం చేస్తున్న రెండు రకాల జీవన వ్యవస్థలే ఈ సమస్యకు మూలకారణం. అందులో ఓ రకం జీవన వ్యవస్థకు అమెరికా నాయకత్వం వహించగా, రెండవ రకపు జీవన వ్యవస్థను రష్యా పోషిస్తుంది. ఈ రెండు జీవన వ్యవస్థలను అర్థం చేసుకోవడం మనకెంతో అవసరం. తద్వారా అనేక మానవ కష్టాలకు గల కారణాలు సులువుగా అర్థం చేసుకోగలం.

అమెరికా అనుసరిస్తున్న వ్యవస్థ క్రొత్తదేమీ కాదు. ప్రపంచంలో అధిక దేశాలు ఈ బాటనే నడుస్తున్నాయి. ఈ జీవన వ్యవస్థలో మూడు అంశాలున్నాయి. ఆలోచిస్తే ఈ మూడు అంశాల్లో ప్రతి ఒక్కటీ అల్లర్లకు అలజడికి దారి తీస్తుంది. అదేమిటంటే, అమెరికాలోను, భారత తదితర అనేక దేశాలలోను, ప్రపంచంలోని అత్యధిక దేశాలలోను రాజ్యాంగాలు

రూపొందించబడ్డాయి. ఈ రాజ్యాంగాలన్నీ ఈ మొదటి అంశం పైనే ఆధారపడి ఉన్నాయి. ఈ రకపు జీవన వ్యవస్థ ప్రప్రథమంగా తననుతాను మతాతీతమైనదిగా ప్రకటించుకొంటుంది. అంటే, ఇలాంటి దేశాలు దైవిక హితబోధలకు దూరంగా ఉంటాయి. దైవిక బోధనల అవసరం ఉందన్న స్పృహ కలిగినా అది వ్యక్తిగత జీవనానికే పరిమితం అంటాయి. మందిర్, మస్జిద్, గురుద్వారాలలో వినబడే దైవాదేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో రాజకీయ, ఆర్థిక ఇక్కట్లలలో మార్గదర్శకత్వాన్నీయడాన్ని అక్కడి పాలక వర్గీయులు అనుమతించరు. ఇలాంటి మతరహిత వ్యవస్థలో పౌరులకు వ్యక్తిగతంగా మతాచారాలను పాటించే అనుమతి అయితే ఉంటుంది. కాని, సామాజిక జీవన విషయాలలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి మానవ మేధస్సు సరిపోతుందన్న భావన వీరిలో ప్రబలంగా ఉంది. అంటే ఈ జీవన వ్యవస్థలో దైవం హోదా ఎలాంటిదంటే, కుటుంబంలో వృద్ధుల మీదపడ్డ ముదుసలి హోదా వంటిది. దైవాన్ని చెరబట్టి సొంత తెలివితేటలతో దైవాదేశాలకు పరిమితులు విధించిన వ్యవస్థ చివరకు ఏమవుతుందో ఆలోచించండి.

ఇలాంటి వ్యవస్థలో విధ్వంసం తప్ప మరేమీ ఉండదు. అదే నేడు పూర్తి ప్రపంచం అనుభవిస్తుంది. ఎందుకంటే, ఈ విభజన అవివేకమైంది. వ్యక్తిగత జీవితంలో దేవుని జోక్యం ఉండవచ్చు. కాని ఏ కారణం వల్ల ఆ దేవుణ్ణి సామాజిక జీవితం నుంచి దూరం చేస్తున్నారు? వ్యక్తుల సమూహమే సమాజం లేదా దేశం అవుతుంది. వ్యక్తులకు దైవాదేశాలు వారి జీవితాలపై చెల్లుబడి అవుతున్నప్పుడు ఆ వ్యక్తులే కలసికట్టుగా పనిచేస్తున్నప్పుడు, తమ భావావేశాలకు, తమ ఆ శక్తులను సామాజికంగా వెలిబుచ్చాలనుకొన్నప్పుడు మాత్రం వారికి దైవాదేశాలు పాటించవలసిన అవసరంలేదని చెప్పడంలో వివేకం ఉందా? ఈ తలబిరుసు వైఖరి మానవాళిని రెండు భిన్న కూటములుగా విడిదీస్తుంది. ఊహ తెలిసింది మొదలు చచ్చేవరకు ఈ విభిన్న వర్గాలు మానసికంగా, నైతికంగా సంఘర్షణలో మునిగిపోవడం తప్ప మరొకటి ఉండదు. మనిషి వ్యక్తిగత, సామాజిక జీవితాలలో రెండింటి

నుంచి దైవాన్ని తొలగించి, పూర్తిగా దైవానికి దూరమై, సొంత జీవన వ్యవస్థ నిర్మించుకొంటే స్వయంకృషితో నిర్మించుకొన్న ఈ జీవన వ్యవస్థ శక్తి హీనమవుతుంది. ఆ శక్తి హీనతను కప్పిపుచ్చుకోవడానికిగాను జీవితాంతం వరకు మానవులను సమస్యల్లో ముంచివేసే సిద్ధాంతాలను వారి నెత్తిన రుద్దరాదు. సమస్యల చట్రంలో చిక్కుకొన్న వ్యక్తులు సామూహికంగా తిరగబడితే విధ్వంసం ఉవ్వెత్తున లేస్తుంది. సమాజం హత్యాకాండలకు ఆలవాలమైపోతుంది.

మరో ముఖ్య అంశం. నేషనలిజం. నేను చెప్పే మాటలు కేవలం భారతదేశానికో లేక పాకిస్తాన్‌కో లేక మరో ప్రత్యేక ప్రాంతానికో ఉద్దేశించినవి కాదు. ప్రపంచ వ్యాప్తంగా వికృత నృత్యం చేస్తున్న విధ్వంసం గురించి మీరు ఆలోచించేలా చేయాలని నా ప్రయత్నం. నేషనలిజం అంటే జాతీయవాదం. ఈ భావన పాతుకున్న జాతికి కలిగే ప్రయోజనాలు ఏవయినప్పటికీ అవి ఇతర జాతులకు మాత్రం ప్రమాద కారణం అవుతాయి. దేశంలోని ఒక మనిషికి మరో మనిషికి మధ్య ఉండే ప్రేమాభిమానాలను నేను తప్పుపడుతున్నానని అనుకోవద్దు. జాతీయవాదం వల్ల పౌరుల్లో తలెత్తే భావాలను మాత్రమే నేను పేర్కొంటున్నాను. జాతీయత అన్నది సహజగుణం. కాని, ఆ ఆత్మీయత ముందుకుపోయి ఎవరన్నా, ఏ వ్యక్తయినా, ఏ జాతి అయినా సరే తమ జాతి ప్రయోజనాల ముందు సమస్త ప్రపంచ ప్రయోజనాలు దెబ్బతిన్నా ఫర్వాలేదని, లేక తమ జాతి భావావేశాల ముందు ఇతర జాతుల భావాలకు విలువలేదని భావించడం, అలా ప్రకటించడం మాత్రం తగని పని. ఎందుకంటే ఇలాంటి భావాలను ప్రేరేపించే జాతీయవాదం తమ జాతి పురోభివృద్ధికి ఏమైనా చేస్తుంది. ధర్మాధర్మాల విచక్షణను లెక్కచెయ్యదు. జాతి పురోభివృద్ధి కోసం దిగజారిన నైతికత అవసరమైతే దీన్ని పాటించేందుకు వెనుదీయదు. నైతికత, సచ్ఛీలం, సద్వర్తనల ప్రసక్తే ఆ జాతికి ఉండదు. జాతి ప్రయోజనాలు మాత్రమే ఆ జాతికి ముఖ్యమవుతాయి. ఇలాంటి ధోరణి ఏ జాతి అయినా అవలంబిస్తే మానవతకు వాటిల్లే నష్టం ఎంతగా ఉంటుందో ఆలోచించండి. ఈ భావనల

ఉన్మాదానికి ప్రతి జాతి గురయితే పూర్తి ప్రపంచం రాక్షస నిలయంగా మారిపోతుంది. ప్రతి జాతి మరో జాతిని శత్రుభావంతో చూస్తుంది. ఓ జాతి ప్రయోజనాలకు మరో జాతి ఆటంకం అని భావిస్తుంది. ఫలితంగా విధ్వంసం, మారణకాండలు చోటుచేసుకొంటాయి. ఈ పరిస్థితిని నేడు మనం చూస్తూనే ఉన్నాం.

ప్రాంతీయతత్వం, జాతితత్వాలు విధ్వంసకరమైనవని ప్రజలు భావించడానికి కారణం, ఈ భావనల వల్ల ప్రజల మధ్య విభజన చోటు చేసుకొంటుందనే కదా. ఈ విభజన వల్ల ఓ జాతి మరో జాతికి, ఓ ప్రాంతం మరో ప్రాంతానికి శత్రువైపోతుందనే కదా. ఇదే హేతువునుపయోగించి మరి కాస్త ముందుకు ఆలోచిస్తే, మానవాళి అనేది ఓ ప్రత్యేక జాతి పేరు కాదు. మానవాళి అంటే భూమండలంపై మూలమూలలకు వ్యాపించి ఉన్న మానవుల ఉమ్మడి పేరు. ఓ దేశంలోని ప్రజల మధ్య ప్రాంతీయతత్వం లాంటి భావనలు విభజనను సృష్టించడాన్ని మనం తప్పుగా భావిస్తున్నప్పుడు, మానవాళిని ఏ విధంగానయినా సరే విభజించే ప్రతి ఒక్క విభజననూ మనం తప్పుగానే భావించాలి. కాని, 20వ శతాబ్దపు విచిత్రమేమంటే, మనం ప్రాంతీయతత్వాన్ని, కులతత్వాన్ని చీదరించుకుని, అలాంటి భావాలు ప్రచారం చేసేవాడు మానవత్వానికి మచ్చతెచ్చేవాడని తప్పుబడుతున్నాం. ఇవే భావాలు మరింత విస్తృతమై జాతీయవాదన రూపంలో ముందుకొచ్చినప్పుడు, ఈ భావాలను ప్రచారం చేసే వారిని హీరోలుగా చూస్తున్నాం- ఎంత విచిత్రం.

మూడో ముఖ్యాంశం ప్రజాస్వామ్యం (Democracy). ప్రజాస్వామ్యం సరయినదికాదని ఎవరన్నా అంటే, అలా అన్నవాడు నియంతృత్వాన్ని (Dictetor ship) సమర్థించేవాడని ప్రజలు భావిస్తారు. ప్రజాస్వామ్యానికి రెండు రూపాలున్నాయి. ఓ రూపం అత్యంత ఆకర్షణీయంగా కానవస్తోంది. రెండవ రూపం తిరస్కరణీయమైనది. ప్రజాస్వామ్యం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఓ వైపు ప్రజాస్వామ్య శత్రువులను పరిమార్చుతూనే మరో వైపు మానవాళి సంక్షేమాన్ని తుదముట్టిస్తుంది. మానవాళిపై

నిరంకుశంగా అధికారాన్ని చలాయించడానికి గద్దెనెక్కే అర్హత ఏ ఒక్క వ్యక్తికో సంక్రమించరాదన్నది ప్రజాస్వామ్యంలోని ముఖ్యోద్దేశ్యం. నిజంగా ఈ ఉద్దేశ్యం ఆదరణీయమైనది. ప్రతి మనిషి తన వ్యక్తిగత, సామాజిక జీవితంలో ఆచరించదగ్గది. కాని, ప్రజాస్వామ్యంలో అంతర్లీనంగా ఉన్న మరో అంశమే మంటే, నిరంకుశాధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. ఈ అంశం దృష్ట్యా మాకు ప్రజాస్వామ్యం పట్ల కొన్ని అభ్యంతరాలున్నాయి.

ఎందుకంటే, ప్రజాస్వామ్యంలోని మొదటి రూపాన్ని- అంటే నిరంకుశాధికారం ఏ ఒక్క వ్యక్తికి సంక్రమించరాదన్నది- ఏ విధంగానయితే మానవాళి సంక్షేమానికి అవసరమని భావించామో అదే విధంగా, రెండవ రూపం- ప్రజల్లో కొందరి చేతుల్లో నిరంకుశాధికారం ఉండడం- మానవతకు వ్యతిరేకమని భావించక తప్పదు.

సమాజంలో ఏ ఒక్క వ్యక్తి చేతుల్లోనూ నిరంకుశాధికారాలు ఉండ డానికి వీల్లేదు. ఎందుకంటే ప్రపంచంలోని ఏ భూభాగంలోనయినా సరే నివసించే సమస్త ప్రజల పరిస్థితులను, సమస్యలను, ప్రజల మనోభావా లను పూర్తిగా తెలుసుకోవడానికి అవసరమైన శక్తిసామర్థ్యాలు, వనరులు ఏ వ్యక్తికీ లేవు. పైగా, అధికారం చేతికి అందాక వ్యక్తి సమాజంలోని ప్రజల ఆలోచనలపై, బావావేశాలపై తన పెత్తనాన్ని చలాయించే ప్రమాద ముంటుంది. అంతేకాదు నియంత ఒంటెద్దు పోకడలకు పాల్పడి ప్రజలపై అణచివేతకు పూనుకొనే అవకాశాలూ మెండుగా ఉన్నాయి. నేనింతకు ముందే చెప్పినట్లు ప్రజల మనోభావాలను, సమస్యలను, అభిలాషలను, ఆకాంక్ష లను పూర్తిగా తెలుసుకొనే శక్తి సామర్థ్యాలు ప్రపంచంలో ఏ మనిషికీ లేవు. అధికార మద్యాన్ని గ్రోలి కూడా నిషా తలకెక్కని వారెవ్వరూ ఉండరు. ఇదే విషయాన్ని మరికాస్త విస్తారంగా ఆలోచిస్తే- మానవాళిపై అధికారం చలా యించే హక్కు ఏ ఒక్క వ్యక్తి చేతుల్లోనో ఉండటం సబబు కాదు. అదే అధికారం కొందరు వ్యక్తుల చేతుల్లో ఉండటం ఎలా సబబవుతుంది. ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు, సమస్యలనుగూర్చి పూర్తిగా తెలుసుకొనే శక్తి ఏ

ఒక్క వ్యక్తికీ లేనప్పుడు కొందరు వ్యక్తులకు మాత్రమెక్కడి నుంచి వస్తుంది. అందువల్ల ఒక్క వ్యక్తిలో లోపాలు ఎలా ఉంటాయో అదే విధంగా కొందరు వ్యక్తుల సమూహంలోనూ లోపాలుంటాయి(లోపాలుండటం సహజం). ఇక మానవాళిపై అధికారం చలాయించడం గురించి నేను మరికొన్ని ఉదాహరణలతో వివరిస్తాను. తద్వారా ప్రజాస్వామ్యం ఏ విధంగా ప్రజల సహజ జీవనాన్ని దెబ్బతీస్తుందో మీ ముందుంచుతాను.

వ్యభిచారం పాపమని ప్రతి మతం పేర్కొంటుంది. ఇది పాప కృత్యం కాదని భావించే సమాజాలేవీ ప్రపంచంలో లేవు. అయితే, ఓ దేశంలోని ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై చర్చించడానికి కూర్చున్నప్పుడు తమ అవగాహనాలోపం వల్ల చేసే నిర్ణయం ఏమంటే- ఈ పనిలో బలవంతం అన్నది లేకపోతే నేరంగా భావించవలసిన అవసరం లేదు. ఈ విధంగా ప్రజాప్రతినిధులు దైవిక పరిమితులను భంగపరిచారు. ప్రతి మతంలోనూ, ప్రతి సమాజంలోనూ అనాదిగా ఆచరణలో ఉన్న శాశ్వత విలువను ఒక్క కలంపోటుతో తుదముట్టించారు. శాశ్వత విలువ మానవత్వానికి, మానవ విలువలకు వ్యతిరేకమని నిర్ధారణ చేసారు. ఇలాంటి శాసనాలు అమలవుతున్న దేశాలలో, అక్కడి సమాజాలలో ఆ తరువాత తలెత్తిన సంక్షోభాలను నేను ప్రస్తావించ దలచుకోలేదు. ఎందుకంటే, మాలో చాలా మందికి ఆ వివరాలన్నీ తెలుసు. ఇలాంటి శాసనాలు నేడు అమలులో ఉన్న దేశాల్లో జనజీవనం ఎంతగా సంక్షోభ భరితం అయ్యిందంటే ఆయా దేశాల్లోని మేధావులు, సంఘ శ్రేయోభిలాషులు తమ దేశ భవిష్యత్తు పట్ల నిరాశోపహతులై ఉన్నారు. ఆయా దేశాల్లో ప్రజాప్రతినిధులు చేసిన శాసనాలు సరయినవి కాకపోవడమే కాదు, ఆ శాసనాల వల్ల శాశ్వతంగా సమాజం నష్టపోతుందని అనేకమంది విశ్లేషించారు; ప్రజాభిప్రాయ సేకరణల్లోనూ తేలింది.

ప్రజాస్వామ్య ధ్వజాన్ని భుజానెత్తుకొన్నట్లు కనబడే దేశం అమెరికా- అమెరికా అనుసరిస్తున్న ప్రజాస్వామ్యాన్ని అనేకమంది ఆదర్శనీయంగా భావిస్తున్నారు. అలాంటి అమెరికాలో సామాజిక రుగ్మతలకు కారణభూతమైన

మద్యాన్ని ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఒకప్పుడు నిషేధించడం జరిగింది. కాని కొంత కాలం తరువాత మద్యపానంలేని నిస్సార జీవితం భరించరాని దయ్యింది. మళ్ళీ ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ఇంతకు ముందు నిషేధించిన దాన్ని మళ్ళీ అనుమతించారు. చెప్పదలచుకొంది ఏమిటంటే, ఈ జోక్యం కూడా దైవశాసనంలో జోక్యం చేసుకోవడమే. నిరంకుశ అధికారాలు చలాయించడంలో ప్రజాస్వామ్యం కూడా నియంతృత్వానికి తీసిపోదు! కోరికలకు, ఆకాంక్షలకు దాసోహం అనడం అక్కడా ఉంది. ఇక్కడా ఉంది. అందువల్ల నియంతృత్వాన్ని మనం చెడుగా భావిస్తున్నప్పుడు, అధికారానికి అడ్డులేని ప్రజాస్వామ్యాన్ని కూడా చెడుగా, నాశనకారిగా భావించక పోవడానికి కారణమేదీ లేదు. మన అభ్యంతరాలు కూడా ఈ నిరంకు శాధికారాల దయలేని ప్రజాస్వామ్యంపైనే. ఎందుకంటే, ఈ ధోరణి వల్ల సమాజం పురోగతి చెందే బదులు నిరంతరం పతనమవుతూ పోతుంది. కొంతకాలం తరువాత ప్రజాభిప్రాయాన్ని జిత్తులతో ఎత్తుగడలతో, మాయా జాలం పన్ని కొనడం, అమ్మడం మొదలవుతుంది. సమాజంలో అందరికన్నా జిత్తులమారి ఎత్తుగడలు వేయడంలో ముందున్న వర్గం ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకొంటుంది. నెమ్మదిగా ఈ అమాయక ప్రజాస్వామ్యం పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యంగా మారిపోతుంది. ఇక్కడ పెట్టుబడి కొందరు వ్యక్తుల చేతుల్లో మారుతూ ఉంటుంది. వ్యక్తిగత స్వేచ్ఛ అన్న చట్టం మాటున ఆ పెట్టుబడిపై ఎలాంటి నిర్బంధం విధించే వీలు ఉండదు. నిర్బంధం విధించేదయినా ఎవరు? ప్రభుత్వం, శాసన నిర్మాణ మండలిలోని సమస్త విభాగాలు అన్నీ, ప్రజల చేత ప్రతినిధులుగా ఎన్నికైన పెట్టుబడిదారుల చేతుల్లోనే ఉంటాయి. అందువల్ల పెట్టుబడిదారులు రెండు చేతులా దేశ సంపదను కొల్లగొడుతూ ఉంటారు. ఆ దేశంలో ఓ వైపున లెక్కించలేనంత సంపాదన గలవారు నివసిస్తుంటే, మరో వైపున ఆదాయ మార్గం అంటూ ఏదీ మిగలని నిర్భాగ్యులు ఉంటారు. మానవాళి సంపద రీత్యా రెండు విభిన్న వర్గాలుగా చీలిపోతుంది.

పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య హస్తాల్లో చిక్కుకొని నాశనమైన వర్గాన్ని ఆదుకోవడానికి సామ్యవాదం వస్తుంది. యూరప్ ఆర్థిక స్థితిని అధ్యయనం చేస్తే ఈ విషయం తెలియవస్తుంది. దేశంలోని పెట్టుబడిదారులు ఆదాయ మార్గాలను, వనరులను అత్యధికంగా తమ చేతుల్లో ఉంచుకొన్నప్పుడు, రెండో వైపున దేశంలోని సాధారణ ప్రజలు ఆర్థికంగా చితికిపోయారు. రోజురోజుకి సాధారణ ప్రజల ఆర్థిక పరిస్థితి నాశనం కాసాగింది. ఇలాంటి పరిస్థితిలో దేశంలో అలజడి, అశాంతి చెలరేగడం సహజం. ఈ అలజడి తీవ్రస్థాయికి చేరినప్పుడు అక్కడి మేధావులు ఈ సమస్యకు మౌలిక ప్రాధాన్యాన్ని ఇచ్చి ఆలోచించడం ఆరంభించారు. ఈ పరిస్థితిని ఎదుర్కోడానికి అనేక మార్గాలు అవలంబించారు. కాని, జర్మనీకి చెందిన యూదు జాతీయుడు ఈ పరిస్థితిని ఎదుర్కోడానికి తన అభిప్రాయాలను సైద్ధాంతికంగా ప్రతిపాదించాడు. పెట్టుబడి, ఆదాయ మార్గాలు రాజ్యపరం కానంత వరకు ఈ ఆర్థిక వినాశనం తప్పదని అన్నాడు. అప్పట్లో నెలకొన్న తీవ్ర పరిస్థితుల నివారణకు ఈ పరిష్కారం విపరీతమైన జనాకర్షణను పొందింది. కొద్ది రోజుల్లోనే ఈ సిద్ధాంతంపై వివిధ దేశాల్లో పార్టీలు స్థాపితమయ్యాయి. ఆర్థిక చిక్కులను దూరం చేసే అనువైన సునాయాసమైన పరిష్కారం లభించిందని ప్రపంచం భావించింది.

కాని, ఈ సామ్యవాద వ్యవస్థ, ముస్ముందు తెలిపినట్లు, మానవాళికి తీవ్ర నష్టం కలిగించేదిగా స్పష్టమయ్యింది. సామ్యవాదంపై చర్చిస్తున్నప్పుడు, ఈ సిద్ధాంతంలో పూర్తిగా మునిగిపోయి ఉన్నవాళ్ళు మన వాదన వినకుండానే-వీళ్ళంతా పెట్టుబడిదారులను సమర్థించే వాళ్ళు అని విరుచుకుపడుతారు. పెట్టుబడిదారీవాదం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకు జన్మనిచ్చే పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యాన్ని మేం సామ్యవాదులకన్నా ఎక్కువగా వ్యతిరేకిస్తున్నాము. సామ్యవాదాన్ని మేము స్పష్టమైన ఆధారాల పరంగా వ్యతిరేకిస్తున్నాము.

సామ్యవాద పునాదులు, వివేకం, వివేచనలపై కాదు, ఆగ్రహం, ద్వేషం, పగ లాంటి భావావేశాలపై ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి

పెట్టుబడిదారీ తత్వాన్ని తుదముట్టించడం వరకయితే బాగానే ఉండేది. పగ ప్రతీకారాల భావాలు పెట్టుబడిదారుల వర్గాన్ని అంతం చేసి మానవాళికి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చగలవు? అసలు ప్రశ్న పెట్టుబడిదారులది కాదు, పెట్టుబడిదారీ తత్వం మనిషిని దౌర్జన్యపరుడిగా మార్చివేస్తుంది. పెట్టుబడి దారుల వర్గాన్ని అంతం చేసినంత మాత్రాన ఈ రుగ్మత సమసి పోదు. సమాజంలో పెట్టుబడిదారీ భావజాలం అలుముకొని ఉన్నప్పుడు ఒక వర్గాన్ని తుదముట్టిస్తే మరో వర్గం తలెత్తుతుంది. అందువల్ల, పగ ప్రతీకార భావాల్లో కొట్టుకుపోయి ఒకే వర్గాన్ని నాశనం చేయడం కాదు పరిష్కారం. పెట్టుబడి, సంపద పొందిన తరువాత కూడా, వాటి వ్యామోహంలో మునిగి పోని వ్యక్తులను తయారు చేయాలి. అసలు పెట్టుబడి సంపదలనే తుద ముట్టించడం ఒక మార్గంకాని సమాజంలో విస్తరించిపోయిన కార్యకలాపాల కోసం పెట్టుబడి ఎంతైనా అవసరం. పెట్టుబడిని తొలగించడం, నాశనం చేయడం అన్నది మానవాళి పట్ల సానుభూతితో కూడుకున్న చర్య కానేకాదు. పైగా ఇది మానవ జాతి పట్ల దయారాహిత్యం. అందువల్ల ఇక మిగిలింది ఒకే ఒక మార్గం. మనం వ్యక్తులను తయారు చేయాలి. సంపద కలిగిన, పెట్టుబడి దారులు అయినప్పటికీ సంపద వ్యామోహం లేని వారిని రూపొందించాలి. ఆర్థిక వ్యవస్థకు సంబంధించినంత వరకు సామ్యవాదం అన్ని రకాల పద్ధతు లను అవలంబిస్తుంది. కాని, వ్యక్తుల విషయానికి వస్తే సామ్యవాదం సాధించింది శూన్యం.

వ్యక్తులను తయారుచేసే బదులు సామ్యవాదం పెట్టుబడి సంపదల యాజమాన్యాన్ని రాజ్యానికి కట్టబెట్టే నియమాన్ని అనుసరించింది.

దీన్ని గురించి క్లుప్తంగా చెప్పాలంటే, పెట్టుబడి సంపదలపై ఏ ఒక్క వర్గానికో గుత్తాధిపత్యం ఉండడాన్ని రూపుమాపి, పెట్టుబడి ప్రజల లేదా రాజ్య సంపదగా నిర్ణయించడం. ఈ విధానం వినడంలో ఎంత సునా యాసంగా ఉందో, ఆచరణలో అంత అసాధ్యం. నేడు సామ్యవాదం ఒక సిద్ధాంతం కాదు. ప్రపంచంలో అనేక దేశాల్లో ఆచరణలోకి కూడా వచ్చింది.

అందువల్ల దీన్ని వ్యతిరేకించే అవకాశం చాలా తక్కువ ఉన్నప్పటికీ, వాస్తవాల వెలుగులో ఈ ఆర్థిక వ్యవస్థ ఆచరణలోకి వస్తే ఎంతగా విఫలమవుతుందో చెప్పడం సముచితం.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను గనుక మీరు గమనించినట్లయితే, సామ్యవాదం మొట్టమొదట ఆచరణలోకి వచ్చిన రష్యాలో పాతికేళ్ళు పైబడి గడిచిన తరువాత కూడా ఆర్థిక పరంగా వర్గ భేదాలు ఎలాంటివి అలాగే ఉన్నాయి. రష్యాలో పెట్టుబడి రాజ్య సంపదగా మారిందన్నది నిజమే. వ్యక్తిగత ఆస్తికి అక్కడ అవకాశం లేకపోయిందన్నది నిజమే. కాని, ఆర్థిక అసమ తుల్యాన్ని రూపుమాపాలని అభిలషించే సామ్యవాదం, పెట్టుబడిని జాతిపరం చేసినంత మాత్రాన లేక వ్యక్తిగత ఆదాయాన్ని రాజ్యపరం చేసినంత మాత్రాన లక్ష్యం నెరవేరదు. ఎందుకంటే, సామ్యవాదం ప్రకారం పెట్టుబడిదారీ అంటే కేవలం- ఒక షావుకారు, ఒక జమీందారు, ఒక భూస్వామి, అధిక సంపద సొంతం చేసుకోవడం, సమాజంలోని మిగిలిన వ్యక్తులు వారికన్నా తక్కువ ఆదాయం కలిగి ఉండడం- మాత్రమేకాదు. సామ్యవాద దృష్టిలో ఒక వ్యక్తి తన శారీరక, మేథోపరమైన శక్తిసామర్థ్యాల వల్ల మిగిలిన వ్యక్తులకన్నా ఎక్కువ ఆదాయాన్ని పొందడం కూడా ఆర్థిక అసమతుల్యమే. ఈ నియమాన్ని ముందుంచుకొని చూస్తే, యూరప్ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన పెట్టుబడిదారీ వాదం రష్యాలో సమసిపోయినట్లేకాని ఇంతకు ముందు ఉన్న ఆర్థిక నిమ్నోన్నతలు, నాడు శ్రామికులకు, పెట్టుబడిదారుల మధ్య ఉన్న అసమతుల్యం నేడు ఉన్నతాధికారులు, సాధారణ ప్రజల మధ్య ఉంది. అంటే, సామ్యవాదులు, పాత పెట్టుబడిదారీ వాదాన్ని అంతం చేసి, దాని స్థానంలో కొత్త పెట్టుబడిదారీ వాదాన్ని స్థాపించారు. అంతే తప్ప సామ్యవాదం పెట్టుబడిదారీ వాదాన్ని నామరూపాలు లేకుండా చేసిందని, స్వేచ్ఛా ప్రజాస్వామ్యతత్వం సృష్టించిన ఆర్థిక అసమతుల్యాన్ని తొలగించిందని అనలేం.

ఆర్థిక అసమానతలను సమాప్తం చేయలేకపోవడమే కాదు, ఇది రాజ్యసంపద అన్న నియమం ఎదుర్కొన్న వైఫల్యాలు ఇంకా ఉన్నాయి. ఈ

శాసనం సమాజంపై తన ప్రభావాన్ని వేసినప్పుడు, ప్రజల్లో ఒకే ఒక విధమైన బద్ధకాన్ని పనిమాంద్యాన్ని సృష్టిస్తోంది. వ్యక్తిగత అస్తికి అవకాశం ఉన్నప్పుడు ప్రజల్లో పని పట్ల ఉండే ఉత్సాహం, సంపద అంతా రాజ్యపరం అయినప్పుడు పని పట్ల ఉత్సాహానికి నీరుగారిపోతుంది. ఈ పరిస్థితిలో పని పట్ల ఉత్సాహం ఉండదు సరికదా, పనిని అనవసరమైన, అసంతృప్తికరమైన బాధ్యతగా వ్యక్తి గ్రహిస్తాడు. దీన్ని ఓ చిన్న ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఒక వీధిలోని పిల్లలు అందరినీ ఎవరో ఒక స్త్రీ పర్యవేక్షణలో అప్పగిస్తే, ఆ పిల్లలందరి పట్ల ఆ స్త్రీ ఒక మాతృమూర్తిగా తన స్వంత పిల్లల పట్ల చూపే ఆప్యాయత మాత్రం చూపదు. అదొక బాధ్యతగా ఆ స్త్రీ గ్రహించి పని చేస్తుంది. బాధ్యత సరిగా నెరవేర్చకపోతే తీవ్ర శిక్షలున్న పక్షంలో శిక్షకు భయపడి పిల్లలను సాకే పని పట్ల ఆసక్తినీ ప్రదర్శించవచ్చు. కాని, ఆ స్త్రీకి పిల్లల పట్ల మానసికంగా ఒక తల్లికి ఉండే ప్రేమాభిమానాలు ఉంటాయని బుద్ధీవివేకం ఉన్న ఏ వ్యక్తీ అనలేడు. ఎందుకంటే మానసిక భావావేశాలనేవి దుకాణంలో పేర్చి పెట్టి అమ్మేవికావు. డబ్బున్నవాడు కొనగలిగినవి కావు.

సామ్యవాదం చిన్న చిన్న పెట్టుబడిదారులను, యాజమాన్యాలను తొలగించి ఆ సంపదను ప్రభుత్వాధికారుల పరం చేసినప్పుడు వాటిపై అజమాయిషి చేసే ఆయా అధికారుల ధోరణి ఎలా ఉంటుంది? లక్షలు, వేలల్లో డబ్బును చూసిన వ్యక్తి భూమిపై కాలు పెట్టడమే అవమానంలా భావిస్తాడు. అలాంటిది మనిషి చేతిలో అసంఖ్యాక వ్యక్తుల ఆహార పానీయాలు ఉన్నట్లయితే అతడు అహంకారిగా గర్వంతో విర్రవీగకుండా ఉండగలదా? ఎవరు అతణ్ణి ఆపగలరు? పెట్టుబడిదారీ వాదం వల్ల కొంత మంది పెట్టుబడి దారుల వర్గం అసంఖ్యాక ప్రజల్ని వధించిందన్న మాట నిజమే. పెట్టుబడిదారీ తత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ సామ్యవాదం పని చేస్తుంది. సంపద, ఆస్తులు మనిషిని దేవుడిగా మార్చేశాయని భావించే సామ్యవాదం, ఈ పరిస్థితి సమాజంలో ఉన్నప్పుడు మనిషి దేవుడిగా మారడు; అధికారం చెలాయించకుండా ఉంటాడని నమ్ముతూ హద్దులు మీరిన ఆత్మానందంతో మెలగడం అవివేకం.

సామ్యవాదం, సమానత్వం అన్న నినాదాన్ని కూడా ఇస్తుంది. సామ్యవాద వ్యవస్థలో ప్రజలందరూ సమానులైపోతారని చాటింపు వేస్తుంది. సమానత్వాన్ని మేము కూడా సమర్థిస్తాము. ఇస్లాం నిస్సందేహంగా సర్వమానవ సమానత్వాన్ని బోధించింది. కాని, మార్క్స్ బోధించిన సమానత్వంతో మాకు సంబంధం లేదు. మావద్ద అసలు ప్రశ్న సమానత్వం అన్నది సాధనాలలో ఉండాలా? లేక ఫలితాలలో ఉండాలా అన్నది. సాధనాలలో సమానత్వం ఉందని అంటే నిస్సందేహంగా మానవత్వానికి నిదర్శనం. కాని మార్క్స్ తత్త్వం సమానత్వాన్ని సాధనాలలో కాదు ఫలితాలలో సమానత్వం ఉండాలంటుంది. ఈ సమానత్వ భావనపై మాకు అభ్యంతరాలున్నాయి. ఈ సమానత్వ భావనను వివేక వివేచనల వెలుగులో పరిశీలిస్తే- పెట్టుబడిదారుల ఏజెంట్లని అనేక మంది అత్యుత్సాహంగల వాళ్ళు హంగామా మొదలుపెడతారు. దీనికి జవాబుగా నేను చెప్పేది ఒక్కటే; ఫలితాలలో సమానత్వం అన్న నియమాన్ని అమలు చేయడం మానవుల శక్తి సామర్థ్యాల్ని, మేధాశక్తిని అపహాస్యం చేయడం కాదా? ఏదన్నా ప్రభుత్వం శాసనాన్ని జారీ చేస్తూ, మోటారు కారుపై వెళ్ళేవాడు, కర్రల సాయంతో నడిచే కుంటివాడు ఇద్దరి ఆచరణలు ఒకే ప్రతిఫలాన్ని పొందుతాయని అంటే; ప్రజలు ఈ పద్ధతి అన్యాయమైనది అని అంటారు. ఎందుకంటే కారు మీద వెళ్ళేవాడికి అన్యాయం జరిగింది.

మరో వివరణాత్మక ఉదాహరణ: కాలేజీల్లో, యూనివర్శిటీల్లో విద్యార్థులు పరీక్ష వ్రాస్తున్నారు. మార్క్సిస్ట్ సమానత్వ నియమం ప్రకారం, మొత్తం విద్యార్థులు సాధించిన మార్కులు అందరికి సమానంగా పంచాలని నిర్ణయిస్తే ఆ నిర్ణయాన్ని ఏ విద్యార్థి అయినా, వివేకమున్న ఏ మనిషి అంగీకరిస్తాడా? ప్రతి వ్యక్తి ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతాడు. లేకుంటే ఏడాది పొడుగున కష్టపడి చదివిన విద్యార్థులకు ఇలాంటి నిర్ణయం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుంది. అందువల్లనే, సమానత్వం అనేది సవ్యంగా ఉండాలని అంటున్నాం. ప్రతి మనిషికి జీవిత పోరాటంలో కావలసిన సాధనాలన్నీ లభ్యం కావాలి. సాధనాలు లభించిన తరువాత కూడా ఎవరయినా వ్యక్తి తన బద్ధకం, నిర్లక్ష్యం కారణాన జీవిత పోరాటంలో

వెనుకబడిపోతే, అది అతడి తప్పు. కష్టపడి చదువనందువల్ల పరీక్ష తప్పిన విద్యార్థిదే తప్పు అని ప్రపంచం భావిస్తుంది. అలాగే ఇదీనూ.

అంతేకాక, ఫలితాల్లో సమానత్వం అన్నది కేవలం సిద్ధాంతం మాత్రమే. ఆచరణలో ఒక్క నిముషం కూడా ఇది నిలువలేదు. రష్యాలో ఈ నియమం దీర్ఘకాలం ఆచరణలో ఉన్నప్పటికీ ప్రజలందరూ ఈ సిద్ధాంతం వల్ల ఒకే ప్రయోజనం పొందడానికి అనుకూలంగా లేరు. స్టాలిన్, మెలోటోల్ ఇతర ఉన్నత స్థానాల్లో ఉన్న వాళ్ళు గడిపిన జీవితం లాంటిదే, అక్కడి శ్రామిక ప్రజలు గడిపారా? అలా జరగలేదంటే, ఈ సమానత్వ నియమానికి అర్థం ఒక్కటే, దీని ద్వారా ప్రజాభిప్రాయాన్ని వక్రమార్గం పట్టించడం. తమ స్వార్థం కోసం ప్రజలను వాడుకోవడమే.

ఈ రెండు ముఖ్యకారణాలు నేడు ప్రపంచాన్ని అశాంతి, అలజడుల మయం చేశాయి. ఇక ఇప్పుడు మేధావుల భుజాలపై బాధ్యత ఉంది. ఈ రెండు వ్యవస్థలకు మారుగా సమతుల్యమైన ఆచరణయోగ్యమైన జీవన వ్యవస్థను స్థాపించడానికి వాళ్ళు ప్రయత్నించాలి.

ఇక నా ప్రతిపాదన ఏమిటంటే, అర్థం చేసుకొన్న అంశాలను ప్రపంచం ముందు సమర్పించి, ప్రపంచం ఈ అంశాల పట్ల గంభీరంగా ఆలోచించేలా చేయాలి. సాఫల్యం పొందడానికి మన మార్గం అనుసరించడం అనివార్యమని అర్థమయితే ఈ వ్యవస్థను స్థాపించడానికి తీవ్ర ప్రయత్నాలు మనమందరం చేయాలి.

సోదరులారా!

విశ్వవ్యవస్థను గురించి మీరెప్పుడయినా ఆలోచించి, పరిశీలించి ఉంటే, ఈ పూర్తి వ్యవస్థలో సమగ్రత, సంపూర్ణత ఉన్నాయని మీరు ఖచ్చితంగా గ్రహిస్తారు. విశ్వవ్యవస్థలో నియమబద్ధత కనబడుతుంది. అత్యున్నత స్థాయిలో సమతుల్యం చూస్తారు. ఏ విధమైన అస్తవ్యస్తతగాని, దోషంగాని కనబడదు. ప్రపంచ మానవాళి కూడా ఈ విశ్వ వ్యవస్థలో ఓ భాగం. అంటే విశ్వ వ్యవస్థలో ఓ భాగంగా- మానవుల మధ్య అదే విధమైన

సమతుల్యం ఉండవలసి ఉంది. ఐకమత్యం, సమైక్యత మానవాళిలో ఉండాలి. మానవ జీవితాలలో సమగ్రత ఉండాలి. అప్పుడే శాంతి భద్రతలు వెల్లివిరుస్తాయి. పూర్తి విశ్వ వ్యవస్థకు అనుగుణంగా మానవాళి నడచినట్లయితే ఇవన్నీ సంభవిస్తాయి. కాని అలా జరగడం లేదు. యావత్ ప్రపంచంలో హింసాకాండ, అల్లర్లు అలజడులు అలుముకొని ఉన్నాయి. భయానకమైన విధ్వంసం వైపునకు ప్రపంచం పరుగెత్తుతుంది. జాతులు జాతులతో, తెగలు తెగలతో ఓ వర్గం మరొక వర్గంతో, కేవలం రంగు భాషల ప్రాతిపదికన, జాతి, దేశాల పేరుతో, పెట్టుబడి, శ్రమ భేదాలతో సంఘర్షిస్తు న్నాయి. అంటే మానవత లోపిస్తోంది. పైశాచికత్వం పేట్రేగుతోంది. మానవ ప్రపంచం రక్తపిపాస తోడేళ్ల గుంపులా తయారవుతోంది. ప్రజల వ్యక్తిగత, సామాజిక జీవనాల్లో భావపరమైన, ధార్మికమైన, మార్గభ్రష్టత సాధారణ మయ్యింది. మంచితనం, సచ్ఛీలాలు మరుగునపడిపోయాయి. సదాచరణలు కరువయ్యాయి. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. సామాజిక అసమ తుల్యం నెలకొంది. ఆర్థిక సమస్యలు, దోచుకోవడం, కొల్లగొట్టడం సర్వసాధా రణమయ్యాయి. రాజకీయ సంఘర్షణలు తీవ్రంగా ఉన్నాయి. నైతిక పతనం, నగ్నత్వం, అశ్లీలం మానవతను పరిహసిస్తున్నాయి. నేటి ఈ ఆధునిక యుగంలో అన్నిరకాల అలజడులు, రుగ్మతలు రాజ్యం చేస్తున్నాయి.

ఈ విధ్వంసకర స్థితి పట్ల ప్రపంచ మేధావులు, సమాజ శ్రేయోభి లాషులు చాలా కలతలకు గురవుతున్నట్లు కనబడుతున్నారు. వార్తా పత్రికల్లో వస్తున్న వారి ప్రకటనలు చూస్తే, ఈ అలజడులకు ఈ సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించడంలో వాళ్ళు సతమతమవుతున్నట్లు కనిపిస్తుంది. ఒక్కోసారి మతబోధనల ఆధారాలు చూపుతారు. మరోసారి మానవత పేరుతో సౌభ్రాతృత్వ సందేశమిస్తారు. ఒకరు ఆర్థిక సమానత్వం వైపు పిలుపునిస్తారు. ఒకరు అత్యంత మృదువుగా "ఒకే ప్రభుత్వం" అన్న నినాదమిస్తారు. మరొకరు ఆర్థిక అసమానతలే అలజడులకు కారణమంటూ కమ్యూనిజాన్ని పరిష్కార మార్గంగా చూపుతారు. ఇంకా కొందరు పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఉత్తమమైంది అని అంటారు. కాని, ఈ రెండు వ్యవస్థలలో- కమ్యూనిజం,

కాపిటలిజం- ఏదీ ప్రస్తుత సమస్యల పరిష్కారంకాదని ఆ వ్యవస్థల చరిత్రయే గొంతెత్తి అరుస్తోంది. పైగా రెండింటిలో ప్రతి ఒక్కటి స్వయంగా సమస్యలకు కారణం కూడా.

ఈ రెండు వ్యవస్థలలోని మౌలిక అంశాలను విమర్శిస్తూ పేష్రో ఫాజిల్ అనే ఆయన వాటిని అమలుచేయడంలో ఎదురయ్యే ఫలితాలను స్పష్టంగా వివరించాడు. ఈ హేతుబద్ధమైన విమర్శను ఎవరూ కాదనలేరు. కాని, ప్రపంచంలో అధికార పగ్గాలు చేతబట్టిన వాళ్ళు, శాంతిభద్రతలను కాపాడే బాధ్యత కలిగిన పెద్దలు విమర్శను ఒప్పుకోవడానికి సిద్ధంగాలేరు. ఎందుచేతనంటే వారి బుద్ధీ వివేకాలు భ్రష్టుపట్టి పోయాయి. అలజడి, హింసాకాండలకు కారణాలేమిటో, ఈ సమస్యకు ఏకైక పరిష్కారమేమిటో వాళ్ళు ఆలోచించరు. ఈ సమస్యలకు సరియైన, సమతుల్యమైన పరిష్కారమే లేదని అర్థం కాదు. పరిష్కారం లేని సమస్య అంటూ ప్రపంచంలో ఏదీ ఉండదు.

మా దృష్టిలో ఈ సమస్యలకు పరిష్కారం ఇస్లాం మాత్రమే. మానవాళి ఇస్లామీయ నియమాలకు అనుగుణంగా తమ వ్యక్తిగత, సామాజిక జీవితాలను మలచుకొన్నప్పుడే ప్రపంచం శాంతి సౌఖ్యాలకు నిలయం కాగలదు. మేము ముస్లింలము కాబట్టి ఆ కారణం వల్ల ఇలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉండడం లేదు. మా ధార్మిక విశ్వాసం ప్రకారం మాత్రమే ఈ భావాన్ని వెలిబుచ్చుతున్నామని అనుకోవద్దు. చారిత్రక సాక్ష్యాల నేపథ్యంలో, బుద్ధీవివేకాలను ఉపయోగించి ఆలోచిస్తే- ఒక్క ఇస్లాం తప్ప మానవ సమస్యల పరిష్కారానికి మరొక మార్గం లేదు. పరిష్కారాలు అని చెప్పబడిన ఇస్లామేతర విధానాలు స్వయంగా సమస్యలకు జన్మనిచ్చాయి.

సోదరులారా!

మనిషి వివేకంగల సంఘజీవి. పుట్టినప్పటి నుంచి మరణించేవరకు లెక్కలేనన్ని సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటాడు. ప్రపంచంలో కళ్ళు తెరచిన వెంటనే తల్లిదండ్రులపై సమీప బంధువులపై ఆధారపడకతప్పదు

మనిషికి. కుటుంబంలో గల సంబంధాలతోపాటు పొరుగువారితో, వీధిలోని వారితో, తన పట్టణ వాసులతో, దేశ పౌరులతో, చివరికి ప్రపంచ మానవాళితో వివిధ రకాలుగా, భిన్నస్థాయిలో మనిషికి సంబంధాలు ఏర్పడుతాయి. ఆర్థిక సంబంధాలు, సామాజిక సంబంధాలు, రాజకీయ సంబంధాలు, అంతర్జాతీయ వ్యవహారాల దృష్ట్యా సంబంధాలు- ఈ సమస్త సంబంధాలు సరిగా, సక్రమంగా, సహజంగా నెలకొంటే అప్పుడే మానవ హక్కులు పూర్తిగా నెరవేరగలవని విశ్వసించవచ్చు. ఫలితంగా ప్రపంచంలో శాంతి భద్రతలు వెల్లివిరుస్తాయని ఆశించవచ్చు. ఈ సంబంధాలు సవ్యంగా, సరిగా ఏర్పడాలంటే అత్యంత సమతుల్యం కలిగిన ఓ అంతర్జాతీయ జీవన వ్యవస్థ అవసరం. మానవ శ్రేయం, సంక్షేమాలకు బాధ్యత వహించేదిగా ఆ వ్యవస్థ ఉండాలి. సమస్త జీవన రంగాలకు సంబంధించిన సహజ నియమాలను పొందుపరచుకొన్న వ్యవస్థ అది అయి ఉండాలి. ప్రతి మనిషి, ప్రతి వర్గం, ప్రతి జాతికి వారి హక్కుల్ని మానవతా పునాదులపై నిర్ణయించేదిగా ఉండాలి. ఆ వ్యవస్థలో బీద ధనిక, నల్లవారు తెల్లవారు, ప్రాచ్యపాశ్చాత్య పక్షపాతాలు- నిమ్నోన్నతా భేదాలు ఉండరాదు. ఆ వ్యవస్థ మానవాళిని జాతులుగా, వంశాలుగా, వర్గాలుగా వివక్ష చూపేది కారాదు. అందరిని కేవలం మానవతా బంధాలలో బంధించేదయి ఉండాలి. నైతికబద్ధమైన, పవిత్ర జీవనాన్ని గడిపే వారికి మాత్రమే ప్రపంచంలో రాజ్యాధికారాన్ని కట్టబెట్టేదిగా ఉండాలి. చరిత్రలో నేటి వరకు పెద్ద పెద్ద మేధావులు, తత్వవేత్తలు, ఎవ్వరు కూడా ప్రపంచంలో అత్యంత మేధాసంపత్తి గల ఏ వర్గం అయినా సరే, ఏ యుగంలోనూ ఇలాంటి జీవన వ్యవస్థను రూపొందించడంలో సఫలమైనట్లు లేదా మనిషి ఇలాంటి పని చేయగలడనిగాని వాదించినది లేదు. ఇందుకు చరిత్రయే సాక్ష్యం. కమ్యూనిజం, కాపిటలిజం లాంటి అనేక అసమతుల్యం నిండిన వ్యవస్థలు ప్రతిపాదించబడ్డాయన్నది నిజమే. ఈ వ్యవస్థలు గందరగోళం, అస్తవ్యస్తతలపై నిలబడ్డాయి. వాటిలో ఆర్థిక సమస్యల పరిష్కారం కొద్దోగొప్పో ఉన్నప్పటికీ ధర్మం, నైతిక ప్రమాణాలు, దైవం, మతం లాంటి మౌలిక అంశాలు నిర్వీర్యం. వ్యక్తికి స్వేచ్ఛ పూర్తిగా నిరాకరించ

బడింది. చివరికి మనిషిని ఓ జంతువుగా లెక్కకట్టి, రెండు పూటల తిండికి బదులు అతడి బుద్ధీ వివేకాలను, శక్తిసామర్థ్యాలను, ధన సంపదలను, అభిప్రాయ, ఆచరణా స్వేచ్ఛలను, చివరికి భార్యాపిల్లలను సయితం జాతీయం వేసేశారు.

వ్యక్తిగత స్వేచ్ఛ, ఆరాధనల స్వేచ్ఛ, అభిప్రాయ ప్రకటన, ఆచరణల స్వేచ్ఛలపై కట్టుదిట్టాలులేని వ్యవస్థల్లో సామాజిక ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయి. ఆర్థిక సమస్యలు పరిష్కారంలేనివిగా తయా రయ్యాయి. నైతికత, మంచితనాలకు సమాధులు కట్టబడ్డాయి. మరికొన్ని వ్యవస్థల్లో ప్రపంచాన్ని పూర్తిగా విస్మరించి ఆధ్యాత్మికత పేరుతో సాఫల్య మార్గాలు ప్రతిపాదించ బడ్డాయి. ఈ వ్యవస్థల్లో ప్రాపంచిక సమస్యలకు పరిష్కారమే కానరాదు. సద్వర్తన, సచ్ఛీలంగల వ్యక్తులను అడవులకు పంపాయి ఈ వ్యవస్థలు. షైతాను నగ్నంగా నర్తించడానికి వేదికగా ప్రపంచాన్ని విడిచి పెట్టాయి. చెప్పేదేమంటే, నేటి వరకు ప్రపంచ మానవాళి సమతుల్యం గల వ్యవస్థను రూపొందించలేకపోయింది. అలాంటి వ్యవస్థను తయారు చేసుకోవడం మానవులకు సాధ్యమయ్యే పనికాదు. చేయలేకపోవడానికి అనేక కారణాలున్నాయి. అవేమంటే:

ఇలాంటి సమతుల్య వ్యవస్థను రూపొందించాలని అనుకొనే వ్యక్తి ఈ పని ఎందుకు చేయలేకపోయాడంటే, అలాంటి వ్యవస్థ రూపొందించడానికి అవసరమైన వనరులు మనిషికి లేవు. తన వద్ద అపరిమితమైన జ్ఞానం ఉందని ఏ వ్యక్తయినా సరే చెప్పగలడా? తన బుద్ధీవివేకాలు అత్యున్నత మైనవని ఎవరయినా భావించగలడా? భావావేశా లకు, ఆశలు ఆకాంక్షలకు అతీతుడినని ఎవరన్నా వాదించగలడా? న్యాయానికి, ధర్మానికి మన్నికగల వ్యక్తి ఎవరయినా ఉన్నాడా? జాతి, కుల, మత, వర్గ, విచక్షణ, ఆశ్రిత, బంధుజన పక్షపాతాలు అసలు లేనివాడు ఎవరన్నా ఉంటాడా? సమస్త ప్రపంచ మానవాళి అవసరాలు, వారి భావావేశాలు, మనస్తత్వాల గురించిన పూర్తి అవగాహన ఎవరికయినాసరే ఉంటుందా? గత చరిత్ర గురించిన సంపూర్ణమైన, సమగ్రమైన, సవ్యమైన రికార్డు ఎవరి వద్ద అయినా ఉందా?

భవిష్యత్తులో జరుగనున్న విషయాల జ్ఞానం ఎవరికన్నా ఉంటుందా?- ఇలాంటి వ్యక్తి ఎవరూ ఉండడు. నిస్సందేహంగా లేడు. అలాంటప్పుడు మానవ మస్తిష్కాలు సృష్టించే జీవన విధానం శ్రేయాన్ని, సంక్షేమాన్ని ప్రసాదిస్తుందని ఎలా చెప్పగలం? శాంతి సౌఖ్యాలకు పూర్తి బాధ్యత వహించగలదిగా ఉంటుందని గ్యారంటీ ఏముంది? అలాంటి వ్యవస్థలో ప్రస్తుత సమస్యలకు సమతుల్యమైన, నిజపరిష్కారం లభిస్తుందని ఎలా చెప్పగలం? భవిష్యత్తులో తలెత్తనున్న సమస్యల చిక్కు ముళ్ళను విప్పగలదని గ్యారంటీ ఏమిటి?- అలా అని ప్రపంచం శాశ్వతంగా ఇలాంటి ఉన్నత వ్యవస్థ కోసం పరితపిస్తూ ఉండాలని అర్థం కాదు. ఇలాంటి వ్యవస్థ ప్రపంచానికి అందుబాటులో లేదని భావమూ కాదు. నిజానికి దైవం ఇలాంటి వ్యవస్థకు అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేసాడు. సమస్త మానవులకు పోషకుడు, పాలకుడు, శాసకుడు అయినందువల్ల దైవం మాత్రమే ప్రతి మనిషికి న్యాయం చేయగలడు. అపరిమిత జ్ఞానానికి నిలయం ఆయన. ఆయన బుద్ధీవివేకాలు అపారమైనవి. భావావేశాలకు, ఆశలకు ఆకాంక్షలకు అతీతుడు. భాషా, రంగు, జాతుల ఆధారంగా ఏ వర్గంతోనూ సంబంధం కలిగి ఉన్నవాడు కాదు. అందువల్ల ఏ ఒక్కరి విషయంలోనూ అతడిలో పక్షపాతం ఉండే అవకాశమే లేదు. పూర్తి చరిత్ర గురించి ఆయనకు సంపూర్ణంగా తెలుసు. భవిష్యత్తులో జరుగనున్న సంఘటనల గురించి ఆయనకు పూర్తి జ్ఞానం ఉంది. ప్రతి మనిషి ఆకాంక్షలను, అవసరాలను ప్రళయం వరకు పుట్టబోయే వారి ఆకాంక్షల అవసరాలను కూడా పూర్తిగా ఎరిగినవాడు. పైగా అతడి అధికారం విశ్వవ్యాప్తం. అతడి అధికార పరిధుల నుంచి బయటపడడం ఎవరికైనా సరే అసాధ్యం. అతడి శక్తి అపారమైనది. ఎప్పుడు తలచుకొంటే అప్పుడు అతడు తన వ్యవస్థను బలవంతంగానయినా సరే స్థాపించగలడు. కాని, అలా చేయడం దేవుని వివేచనకు, వివేకానికి భిన్నమైనది కనుక ఆ దైవమే ఇలా అంటున్నాడు: "మనిషి భౌతిక అవసరాలను తీర్చడానికిగాను ఈ విశ్వంలో అసంఖ్యాక ఏర్పాట్లు చేసిన దైవం, ఇక్కడి సమస్త వస్తువులపై మనిషికి అధికారమిచ్చిన దైవం, మనిషికి అతి ముఖ్యమైన

ఈ భౌతిక అవసరాన్ని విస్మరించి ఉంటాడా? మానవాళిని చీకట్లో దేవులాడేలా, గోతుల్లో పడేలా, ఎదురుదెబ్బలు తినేలా వదిలివేస్తాడా? మానవ జీవితానికి ఓ విధానాన్ని, సిద్ధాంతాన్ని దైవం సూచించలేదా? కేవలం మనిషి భౌతిక అవసరాలను మాత్రమే దైవం తీర్చాడా? మనిషికి శరీరక ఆహారాన్ని మాత్రమే ఇచ్చాడా? మనిషి ఆత్మకు- శరీరానికి ఆధారమైన ఆత్మకు ఆహారం ఏర్పాటు చేయలేదా? నిశ్చయంగా చేశాడు. అలా చేయకపోవడం దేవుని కారుణ్యానికి పొసగని పని. ప్రతి కాలంలోనూ ప్రతి జాతిలోనూ దైవం తనకు ఇష్టమైన దాసుల ద్వారా- వీరినే ప్రవక్తలని అంటారు, ఇస్లాం అన్న పేరుగల ఒక సంపూర్ణ జీవన విధానాన్ని పంపాడు. ఈ జీవన విధానానికి సమగ్రరూపం, అల్లాహ్ తన ఆఖరు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ద్వారా నేటికి దాదాపు పద్నాలుగు వందల సంవత్సరాల పూర్వం, సమస్త ప్రపంచం ముందు ఆచరణాత్మకంగా ప్రతిపాదించారు. ఈ చివరి ప్రవక్త (సఅసం) అరబ్బు దేశంలో జన్మించారు.

ఇస్లాం అంటే- దీర్ఘకాలంగా ముస్లిములు అనబడేవారు వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక జీవితాల్లో, నైతికత, నాగరికత, సాంస్కృతిక మైదానాలలో, రాజకీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో పాటిస్తూ వస్తున్న ఇస్లాం కాదు. ముస్లిములకు వారసత్వంగా మారిన ఇస్లామ్ కాదు. ఇతర మతాల మాదిరిగా కేవలం పూజలకు, ప్రత్యేక ఆచారాలకు మతంగా మార్చబడ్డ ఇస్లాం కాదు. జాతివాదం, దేశీయవాదం, ధనపూజలకు అవకాశాలు ఉన్నది అసలు ఇస్లామ్ కాదు. దైవాన్ని మస్జిదులలోనో, ఆరాధనాలయాలలోనో బంధించేది కూడా ఇస్లామ్ కాదు. సామూహిక వ్యవహారాల్లో దైవానికి జోక్యం లేదనేది ఇస్లామ్ కాదు. మేము ఇస్లామ్ అని ప్రస్తావిస్తున్నది ఖుర్ఆన్, సున్నత్‌లలో భద్రంగా ఉన్న ఇస్లామ్ గురించి. ఖిలాఫత్ కాలంలో శ్రేయోసౌభాగ్యాల ప్రవాహంలా, పరవళ్ళు త్రొక్కిన ఇస్లామ్ గురించి. కేవలం ఏకైక దైవాన్ని ఆరాధించమని బోధించిన ఇస్లామ్ గురించి. సమస్త మానవాళికి సమగ్ర జీవన విధానమైన ఇస్లామ్ గురించి. దైవం ప్రసాదించిన ఇతర భౌతిక అనుగ్రహాలను ఉప యోగించే హక్కు మనిషికి ఎలా ఉందో అలాగే దాన్ని అనుసరించే హక్కు

ఉంది. ఇది అంతర్జాతీయ మానవ శ్రేయోసౌభాగ్యాల కార్యక్రమం. క్లుప్తంగా చెప్పాలంటే ఇది మానవ ప్రవృత్తికి సహజమైన ధర్మం. ఇందులో విశ్వాసాలు, ఆరాధనల గురించిన బోధనలతోపాటు నైతికత సామాజిక నియమాల పద్ధతులు, ఆర్థిక శాసనాలు, రాజకీయ విలువలు- అంతర్జాతీయ వ్యవహారాల పరిష్కారాలు కూడా ఉన్నాయి. సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు ఇది పరిష్కారమని నేటికి పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితమే నిరూపితమైనప్పుడు నేడు కూడా సమస్త సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అందుకే ఖుర్ఆన్ ఇలా బోధించింది:

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ
نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا۔

**"నేడు మేము మీ ధర్మాన్ని సంపూర్ణం చేశాము. మీపై మా అనుగ్రహాన్ని పూర్తి చేశాము. మీ కోసం ధర్మంగా ఇస్లామ్‌ను కోరుకున్నాం."**

మరో చోట దైవం ఈ అంశం గురించి ఇలా ప్రస్తావించాడు:

اِنَّ الدِّيْنَ عِنْدَ اللّٰهِ الْاِسْلَامُ

**"అల్లాహ్ దగ్గర సత్యధర్మం (జీవన వ్యవస్థ) కేవలం ఇస్లామ్ మాత్రమే."**

ఇస్లామ్ పట్ల మనకున్న విశ్వాసంకొద్దీ ఈ మాటలు అనడం లేదు. ప్రపంచంలోని ఇతర వ్యవస్థలను కూడా తులనాత్మకంగా అధ్యయనం చేశాక, అల్‌హమ్దులిల్లాహ్, ప్రతి జీవన రంగంలోనూ, ఇస్లామీయ ఆదేశాలు ఇతర వ్యవస్థలకన్నా ఎక్కువగా, సంతృప్తికరమైనవిగా, సమస్త మానవులకు ఆమోదయోగ్యమైనవిగా సహజమైనవిగా ప్రతి దేశం, ప్రతి సమాజంలోనూ ఆచరణీయమైనవిగా నిరూపితమయ్యాయి. ఈ ఆధారంతోనే మేము, ప్రతి ఒక్కరితో, మీరు ముస్లిమ్ అయినా, ముస్లిమేతరులయినా, పాశ్చాత్య విద్యావేత్తలయినా, లేక ప్రాచ్య విద్యను పొందినవారయినా- ఎవరయినా సరే

సంకుచితత్వాన్ని, వివక్షను వదలి బుద్ధివివేకాల గీటురాయిపై ఇస్లామ్ జీవన వ్యవస్థ సరి అయినదో కాదో పరీక్షించండి అని చెబుతున్నాం. ఈ పరీక్షలో మీకు ఇస్లామ్ పట్ల సంతృప్తి కుదిరితే మీరు ఇస్లామ్ చూపించే మార్గంపై సమాజాన్ని సరికొత్తగా నిర్మించడంలో చేయూతనీయండి. తద్వారా ప్రపంచం శాంతి భద్రతల నిలయంగా మారగలదు.

ఇప్పుడు, ఇస్లామ్ నేటి ప్రపంచ సమస్యలకు మౌలిక పరిష్కారాన్ని ఎలా ప్రతిపాదిస్తుందో? ఇస్లామ్ ఆచరణీయంగా ఎలా ఉందో చూద్దాం. ప్రపంచంలో ఉన్నతమైనవని అనుకొన్న వ్యవస్థలు సామ్యవాదం, ప్రజాస్వామ్యం ప్రస్తుత సమస్యలను పరిష్కరించలేకపోయాయి. కాని ఇస్లామ్ ఇంత పాత మతం అయి ఉండి కూడా ప్రపంచాన్ని కల్లోలాగ్ని నుంచి కాపాడి శాంతి సౌహార్ధతలను ఇవ్వగలదు, ఇదేమీ ఆశ్చర్యదాయకమైన, విచిత్రమైన వ్యాఖ్య కాదు. ఇది ఒక వాస్తవం.

ఇస్లామ్ ప్రతిపాదించే పరిష్కారం ఏమిటంటే, నేటి మానవ సమాజం ఏ పునాదులపై స్థాపితమై ఉందో, ఆ సమాజపు సంస్కృతి, నాగరికతలు ఏ నియమాలపై ఆధారపడి ఉన్నాయో, నైతికత, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు ఏ సూత్రాలపై పనిచేస్తున్నాయో అవన్నీ ధర్మరహిత సూత్రాలు. వీటన్నింటిని తొలగించి ఓ కొత్త వ్యవస్థను క్రింది నియమాల ఆధారంగా నిర్మించాలి.

1. అధికారం ఒక్కరిదే.
2. మానవాళి అంతా ఒక్కటే.
3. జీవన వ్యవస్థ ఒక్కటే.
4. ఆదర్శం ఒక్కటే.
5. మానవాళి లక్ష్యం ఒక్కటే.

## 1. అధికారం ఒక్కరిదే

అన్నింటికన్నా ముందు అధికారం ఒక్కడిదే అన్న నియమాన్ని చూద్దాము. నేడు ప్రపంచ వ్యాప్తంగా అధికారం కోసం కుమ్ములాట ఉంది.

ప్రతి జాతి, ప్రతి దేశం, ప్రతి వర్గం, ప్రతి రాజకీయ పార్టీ ప్రపంచంలో అధికారాన్ని ఏదో విధంగా హస్తగతం చేసుకోవాలని చూస్తుంది. అందువల్లనే ప్రతి రోజూ పత్రికల్లో ఫలానా పార్టీకి, పలానా సిద్ధాంతంగల పార్టీకి, ఫలానా జాతికి అధికారం అందిస్తే ప్రపంచంలో సమస్యలన్నీ పరిష్కారం అయిపోతాయని అంటూ ప్రతి పార్టీ, ప్రతి జాతి అధికారాన్ని సంపాదించాలని పెనుగులాడుతున్నాయి. ఫలితంగా ప్రపంచం అధికారం కోసం జరిగే పోరాటాల రంగస్థలిగా మారిపోయింది. వివిధ జాతులు, విభిన్న వర్గాలు అధికారాసనాన్ని అధిరోహిస్తే అధికార నిషాలో సమస్త ప్రపంచాన్ని తమ అడుగులకు మడుగులొత్తేలా చేయాలనుకొంటాయి. రెండు ప్రపంచ యుద్ధాలు, ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలు ఈ వాస్తవానికి సాక్ష్యమిస్తున్నాయి. నేడు ఈ సంఘర్షణ ఎంత తీవ్రంగా ఉందంటే, ఇది మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఇదంతా అధికారం కోసం సాగే పెనుగులాటల ప్రతిఫలం. సమస్త ప్రపంచ మానవులు గనుక అధికారం ఒక్కడిదే అన్న మాటకు కట్టు బడినట్లయితే ఈ విభిన్న, వివిధ అధికార శక్తులన్నీ తమకు తామే అంతమై పోతాయి. సర్వ ప్రపంచానికి 'ఒకే ప్రభుత్వం' అన్న భావన అమలు కాగలుగుతుంది. ఈ విధంగా అధికారం కోసం సాగే యుద్ధం చాలా వరకు రూపుమాసిపో గలదు. కాని, ఇంత అసాధరణ, అత్యున్నత అధికారాన్ని ఏ జాతి, ఏ వర్గం చేతుల్లో పెట్టాలన్నది ప్రశ్న. మనిషికి ఇంతటి ఉన్నత స్థానాన్ని అందుకొనే హక్కు ఉందా? ప్రపంచ మానవులందరూ ఒక వ్యక్తి, ఒక వర్గం అధికారాన్ని అంగీకరిస్తారా? ఒకవేళ ఇలా జరిగినప్పటికీ, అధికారాన్ని అందుకొన్న వర్గం ప్రపంచంలో నియంతగా మారదని నమ్మకం ఏమిటి? అధికార మత్తులో మునిగి న్యాయం గొంతు నులమరని గ్యారంటీ ఏముంది? మనిషికి సాధారణ అధికారం లభించినప్పుడే మనిషి నియంతగా మారడాన్ని మనం చూస్తున్నాము. ప్రపంచ పాలకునిగా, ఒక వ్యక్తిని అంగీకరిస్తే అతడు నిరంకుశ నియంతగా మారకుండా ఎలా ఉండగలడు? చరిత్ర సాక్ష్యమిస్తోంది, నేటికీ అనేక దేశాల్లో ఈ బాధాకర వాస్తవం కళ్ళకు కనబడుతోంది. మరో భావన కూడా ఈ సందర్భంగా తలెత్తుతుంది. ఒక

ప్రభుత్వం అన్న నియమాన్ని అంగీకరిస్తూనే ఒక సంఘటన (Federation)ను ఎందుకు ఏర్పరచరాదు? ప్రపంచ దేశాలన్నింటికి ప్రాతినిధ్యం వహించే లాంటి సంఘటన ఒక దాన్ని ఏర్పరచవచ్చుకదా- అలాంటి సంఘటన (Federation) ఒత్తిళ్ళకు తలవొగ్గి న్యాయాన్ని సమాధి చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అది శ్రేయోప్రభుత్వంగా ఉంటుంది. కాని, ఈ వాదనలోనూ లోపం ఉంది. గతంలో ఏర్పడ్డ 'నానాజాతి సమితి' గతి ఏమయ్యిందో మనకు తెలియనిది కాదు. ప్రస్తుతమున్న 'ఐక్యరాజ్యసమితి' రెండు వర్గాలుగా చీలి ప్రపంచంలో కల్లోలానికి కారణమయ్యింది. వాస్తవమేమంటే, మనిషి స్వయాన అనేక బలహీనతలు కలిగి ఉన్నాడు, అందువల్ల మనిషి పాలనాధికారం వల్లనే నేటి వరకు ప్రతి యుగంలోనూ కల్లోలాలు వచ్చాయి. అలా అని ఒకే ప్రభుత్వం అన్న భావన అమోదయోగ్యమైనదికాదని అధికారం కోసం కుమ్ములాటల సమస్య పరిష్కారం లేనిదని అర్థం కాదు. ఇస్లాం ప్రకారం, దైవం సమస్త విశ్వానికి సృష్టికర్త, ప్రభువు, కాబట్టి దైవం అత్యున్నత అధికారాన్ని పొంది నిరంకుశునిగా మారే అవకాశం అణుమాత్రం లేదు. ఎందుకంటే, దైవానికి అధికార పిపాస లేదు. పైగా దేవుని ఆధిక్యత ఆరంభం నుంచి విశ్వంలో ఎల్లెడలా విస్తరించి ఉంది. భావావేశాలకు, ఆకాంక్షలకు అనురాగా లకు దేవుడు అతీతుడు. అత్యున్నత న్యాయమూర్తి, వివక్ష, పక్షపాతాలతో దేవుడు న్యాయాన్ని సమాధి చేస్తాడన్న భయం పిసరంత కూడా లేదు. అందువల్ల ఒకే ప్రభుత్వం అన్న నియమాన్ని అంగీకరిస్తూ, ఆ దైవాన్నే పాలకునిగా, ఉన్నత అధికారం కలవానిగా, అత్యున్నతునిగా అంగీకరిస్తే వ్యవహారం యావత్తు కుదుటపడుతుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి దేవుని అత్యున్నత అధికారాన్ని అంగీకరిస్తాడు. ఎందుకంటే, దైవానికి ఏ ప్రత్యేక వర్గంతోనూ ప్రత్యేక సంబంధం లేదు. అందువల్ల దైవం పక్షపాతాన్ని వహించే అవకాశమే లేదు. దైవాన్ని అత్యున్నత అధికారిగా అంగీకరిస్తేచాలు, అధికారం కోసం కుమ్ములాటలు, రక్తపాతాలు సమసిపోతాయి. ఈ విధంగా ప్రపంచాన్ని పీడిస్తున్న ఓ పెద్ద సమస్య పరిష్కారమైపోగలదు. ఇక్కడ మరో విషయాన్ని స్పష్టం చేయాలి. దైవం స్వయంగా మానవ రూపంలో అధికారాసనాన్ని

అధిరోహిస్తాడని అర్థం కాదు. ఈ బాధ్యతను మనుష్యులే నిర్వర్తిస్తారు. దైవం పట్ల ప్రేమ, దైవభీతి హృదయాల్లో నింపుకొన్న దైవదాసులు మానవతా మూర్తులు ఈ బాధ్యత నిర్వర్తిస్తారు. వీళ్ళు దైవాదేశాలకు అనుగుణంగా నడుస్తారు. నైతికత, నడవడికల రీత్యా అత్యున్నతులు. దైవభీతితో పాటు ప్రపంచ పాలనా వ్యవహారాలను నడిపే శక్తి కలిగి ఉంటారు. దైవం ముందు జవాబు చెప్పాలన్న బాధ్యతా భావం వీరిలో ఎంత తీవ్రంగా ఉంటుందంటే, దైవాభీష్టానికి వ్యతిరేకంగా పని చేయాలన్న ఆలోచనతో కూడా భయకంపితులవుతారు. దైవాన్ని అత్యున్నత అధికారిగా విశ్వసిస్తారు. దైవం ఆదేశించిన జీవన విధానాన్ని అత్యధికంగా అనుసరిస్తారు. ప్రభుత్వ శక్తిని, వనరులను అన్నింటిని దైవధర్మం కోసం వినియోగిస్తారు. సమస్త ప్రపంచం ఒకే ప్రభుత్వ వ్యవస్థ క్రిందికి రావలసిన అవసరం కూడా లేదు. ప్రతి జాతి, ప్రతి దేశం తన అంతర్గత, అంతర్జాతీయ విధానాలను స్వయంగా నడుపుకో గలదు. కాని దైవమే ఏకైక అధికారి అన్న భావన ఆధారంగా దైవ భీతితో, దైవ దాసులైన వ్యక్తుల ద్వారా తన విధానాలను అమలుపరచుకోవాలి. ఈ విధంగా ప్రపంచంలో ఒకే ప్రభుత్వ భావనకు అత్యున్నత ఉదాహరణ నెలకొంటుంది. ప్రపంచంలో అధికారం కోసం జరిగే పోరాటాల సమస్య దూరమవుతుంది.

## 2. మానవాళి అంతా ఒక్కటే

సరికొత్త సమాజ నిర్మాణంలో రెండవ నియమం, మానవాళి అంతా ఒక్కటే అన్నది. ఈ నియమం ద్వారా ప్రస్తుతం నెలకొని ఉన్న అనేక సమస్యలు దూరం అవుతాయి. నేడు మానవాళి వివిధ వర్గాలుగా కృత్రిమ విభజనకు గురయి ఉంది. ఈ అసహజ విభజన వల్ల అంటే భౌగోళిక, జాతిపర, భాషాపర, జాతీయతాపరమైన విభజనల వల్ల ప్రతి వర్గం, ప్రతి దేశం, జాతి పరస్పర ద్వేషం, శత్రుత్వాలతో మునిగిపోయాయి. బలంగలవాళ్ళు బలహీనులపై దౌర్జన్యాలు సాగిస్తున్నారు. ఓ జాతి వ్యక్తి మరో జాతి వ్యక్తితో మానవీయ విలువలపరంగా వ్యవహరించడానికి సిద్ధపడలేకపోతున్నాడు. ఓ దేశం వ్యక్తి మరో దేశంలో విద్వేష దృక్కులను ఎదుర్కొంటున్నాడు. కొన్ని దేశాల్లో పర

దేశస్థుడు దొంగ, మోసగాడు, గూఢాచారి అన్న ఆరోపణలను ఎదుర్కొంటే, మరికొన్ని దేశాలలో పౌర హక్కులు, మానవీయ సానుభూతి అలభ్యమవుతోంది. జాతి స్వార్థం, వర్గ వివక్ష ప్రజల్లో పాతుకుపోయి చివరకు మానవత మృగ్యమైపోయింది. మానవతకు ఇంతకుమించి అమర్యాద ఇంకేముంటుంది. ఈ విషాదకర పరిస్థితిని అదుపు చేయాలంటే, ప్రపంచం లోని సమస్త జాతులూ- మానవులంతా ఒక్కటే- అన్న నియమాన్ని అంగీ కరించడమే మార్గం. జాతి వ్యవహారాలను స్వయంగా నడుపుకొంటూ, ప్రపంచంలోని ఇతర జాతుల శ్రేయోపురోభివృద్ధులపట్ల మానవతా దృష్టి కలిగి ఉండాలి. ఇదే మానవత. ఇందులోనే జాతుల సాఫల్యం ఉంది. ఇస్లాం చెప్పే వాస్తవం కూడా ఇదే. మానవులలో ఏకత్వం, సమానత్వం, పరస్పర సహకారం, సమైక్యత ఉండాలని ఇస్లాం అభిలషిస్తుంది. ఎందుకంటే ప్రపంచం లోని సమస్త మానవులు, ఏ ప్రాంతంలో నివసించేవారయినా, ఏ భాష మాట్లాడే వారయినా, ఏ జాతికి చెందిన వారయినా సరే- అందరూ ఒక జంట- ఆదం హవ్వాల సంతానం. అందరి సృష్టికర్త, ప్రభువు, స్వామి ఒక్కడే. అందరూ అతడి దాసులు. ఆ విశ్వప్రభువు తన సామ్రాజ్యంలో సౌభ్రాతృత్వ, సామరస్యాలను అభిలషిస్తాడు. జాతి వర్గ వైరాలు ఆయనకు అయిష్టం. వాటివల్ల మానవ సమాజాల శాంతి శ్రేయాలు ధ్వంసమవుతాయి. అయితే మంచి చెడుల విచక్షణ ఉండటం అవసరం. మంచిని పెంచడం, చెడును త్రుంచడం ఆ సమాజ లక్ష్యం అవుతుంది. తద్వారా సమస్త మానవులు సద్వర్తనులుగా మారుతారు. మానవులు అంతా సమానులుగా ఉంటారు. భూమ్యాకాశాల ప్రభువు దైవం. సమస్త మానవులు ఆయన సృష్టితాలు. భూగోళం మానవులందరి నివాస స్థలం. ఈ మానవాళి అంతా ఒక్కటే అన్న ఈ నియమాన్ని ప్రతి జాతి గనుక అంగీకరిస్తే, ఈ నియమానికి అనుగుణంగా నడిస్తే, సమస్యలు పరిష్కృతం అవుతాయి. జాతివైరాలు రూపుమాసిపోతాయి. జాతి స్వార్థం, వర్గవివక్ష సమసిపోతుంది. సామాజిక అసమతుల్యం శాశ్వతంగా అంతం అవుతుంది.

## 3. జీవన వ్యవస్థ ఒక్కటే

ఇక మూడవ నియమం: ఒకే జీవన వ్యవస్థ. ఇది మౌలిక నియమం. దీని పునాదులపై సరికొత్త సమాజ నిర్మాణానికి మనం పూనుకొంటున్నాం. ఒకే జీవన వ్యవస్థ అంటే మా దృష్టిలో సమస్త ప్రపంచ మానవులు, జాతి వర్గ వర్ణ విచక్షణకు అతీతంగా అందరూ ఒకే జీవన విధానాన్ని అనుసరించాలి. అందరి నైతిక, సామాజిక భావాలు ఒకేలా ఉండాలి. అందరి నాగరికత, సంస్కృతి మౌలికంగా ఒకే విధంగా ఉండాలి. అందరి రాజకీయ, ఆర్థిక నియమాలు ఒకేలా ఉండాలి. అందరి మధ్య పరస్పర సంబంధాలు సమానత్వం ప్రాతిపదికన ఉండాలి. ఈ జీవన వ్యవస్థ మానవులు తయారుచేసినది కారాదు. ఎందుకంటే, ఇంతకు ముందు పేజీల్లో సాక్ష్యాధారాలతో సహా చెప్పాము. కొన్ని బలహీనతలు, లోపాల కారణంగా మానవులు తయారు చేసుకొనే వ్యవస్థలు, సిద్ధాంతాలు మానవ సంబంధాలను సరియైన, సహజమైన పునాదులపై స్థాపించలేవు. ఓ జాతి ప్రతిపాదించిన వ్యవస్థను మరో జాతి అంగీకరించడానికి సిద్ధం కాదు. అయితే, ప్రపంచంలోని ప్రతి జాతికి మానవులకన్నా అత్యున్నత శక్తి ప్రతిపాదించిన వ్యవస్థను స్వీకరించడానికి అభ్యంతరముండదు. ఎందుకంటే, ఆ మహాశక్తిమంతుడు కేవలం ఏదో ఒకే జాతి శ్రేయం కోసం వ్యవస్థను రూపొందించడు. సమస్త మానవుల సహజ అవసరాలు, శక్తిసామర్థ్యాలపరంగా వ్యవస్థను రూపొందిస్తాడు. నేడు, ప్రపంచంలోని సమస్త జాతులు స్వయంగా తయారు చేసుకొన్న జీవన వ్యవస్థలను అనుసరిస్తున్నాయి. ఫలితంగా అంతర్గత అలజడి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. ఈ కృత్రిమ జీవన వ్యవస్థల వల్ల ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు జరుగుతున్నాయి. దీనికి మంచి ఉదాహరణ కమ్యూనిజ కాపిటలిజంల మధ్య ఘర్షణ. ఈ పరిస్థితిలో ఒకే జీవన వ్యవస్థ అన్న నియమాన్ని మానవులు అంగీకరించి నట్లయితే, ఆ వ్యవస్థ కేవలం ఇస్లామ్- మానవుల సృష్టికర్త రూపొందించిన సత్యధర్మం అయినట్లయితే, అప్పుడు ప్రపంచంలో ఈ ఆందోళనలు, అశాంతి, ఉద్రిక్తతలు దూరమవుతాయని, సమస్త మానవుల పరస్పర సంబంధాలు సుహృద్భావ పూరితంగా ఉంటాయన్న వాస్తవాన్ని ప్రపంచంలో వివేకంతో విజ్ఞతతో ఆలోచించే వారు తెలుసుకోగలరు.

## 4. ఆదర్శం ఒక్కటే

ఇక నాలుగవ నియమానికి వస్తే, ఒకే ఆదర్శం. అంటే మా దృష్టిలో, సమస్త మానవులు ఒకే ఆదర్శాన్ని కలిగి ఉండడం. తమ శక్తిసామర్థ్యాలన్నింటినీ ఆ ఆదర్శ సాధనలో వెచ్చించాలి. నేడు ప్రపంచంలో వివిధ వర్గాల ఆదర్శాలు విభిన్నంగా ఉన్నాయి. ప్రతి వర్గం, ప్రతి కూటమి, వేరు వేరు ఆదర్శాలు కలిగి ఉన్నాయి. ప్రతి వ్యక్తి, ప్రతి వంశం వేరు వేరు జీవిత ధ్యేయాలను కలిగి ఉన్నారు. ఈ ఆదర్శాల కోసం వీళ్ళు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఆదర్శాలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటున్నాయి. ప్రపంచ శాంతికి, భద్రతకు ప్రమాద కారణమవుతున్నాయి. పైగా ఈ ఆదర్శాలు అనుదినం మారుతూ ఉన్నాయి. ఎందుకంటే, ఈ ఆదర్శాలు సాధారణంగా తాత్కాలికమైనవి, తప్పుడు ఆలోచనలతో కూడుకొన్నవి. ఈ రోజు దేశ స్వాతంత్ర్యం జీవితాదర్శంగా నిర్ణయిస్తే రేపు ఇతర దేశాలను స్వాధీనం చేసుకోవడం ఆదర్శమవుతుంది. ఈ విధంగా ప్రపంచంలో కర్రగల వాడిదే బర్రె అన్న న్యాయం నెలకొంటోంది. పూర్తి ప్రపంచంలోని జాతులు ఏకాభిప్రాయంతో ఒకే ఆదర్శాన్ని అవలంబిస్తే, అందరూ కలసి ఆ ఆశయసాధనకు సామూహిక కృషి జరిపితే, జాతిపరమైన విద్వేషాలు సమాప్తం కాకపోవడమనేది జరగదు. అయితే ఆ ఏకైక ఆదర్శం ఏది? అను ప్రశ్న తలెత్తుతోంది. ఓ జాతి, లేదా వర్గం ప్రతిపాదించే ఆదర్శమా? ఎవరి ప్రయోజనాలు ఆ ఆదార్శనికి ఉంటాయి? ఇది ఏమంత ముఖ్య సమస్యకాదు. ఇస్లామ్ దృష్టిలో మనిషి జీవిత లక్ష్యం, సమస్త మానవాళికి ఆదర్శం- దీన్ని నిర్ణయించే పని దైవానిది. ఆయనే సమస్త మానవుల సృష్టికర్త, ప్రభువు కాబట్టి మనుష్యులు ఏం చేయాలి అన్నది ఆయనకే బాగా తెలుసు. ఆయన నిర్ణయించిన ఆదర్శం మానవుల శ్రేయోసౌభాగ్యాలకు మూల కారణమవుతుంది. ఇలాంటి జీవిత లక్ష్యాన్ని ఏలాంటి భేదాభిప్రాయం లేకుండా ప్రపంచంలోని ప్రతి జాతి అంగీకరించగలదు. దైవం తన కరుణ, అనుగ్రహాలతో తన ప్రవక్తల ద్వారా సమస్త మానవులు తమ వ్యక్తిగత సామాజిక జీవితాల్లో దైవాదేశాలకు అనుగుణంగా నడువాలన్న మార్గదర్శకత్వాన్ని ఇచ్చాడు. దైవానికే దాస్యం చేయాలని, ఆయన ఆజ్ఞలను పాటించాలని

ఆదేశించాడు. ఆయన ఇష్టాన్ని, సంతోషాన్ని పొందడం కోసం సమైక్యంగా సామూహిక స్థాయిలో సమస్త జీవన రంగాలలోనూ దైవాదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి అని అన్నాడు.

ఖుర్‌ఆన్‌లో మనిషి సృష్టిలో ఉన్న ఉద్దేశ్యం కూడా ఇదే అని ఖుర్‌ఆన్ ఘంటాపథంగా చెబుతూంది.

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُوْنِ

**"మేము జిన్నులను, మానవులను, కేవలం మా దాస్యం చేయడానికే సృష్టించాము."**

## 5. మానవాళి లక్ష్యం ఒక్కటే

నూతన సమాజ నిర్మాణంలో అయిదవ నియమం- ఒకే లక్ష్యం: దీనిని గురించి చూద్దాం. ఒకే లక్ష్యం అంటే మా ఉద్దేశ్యం మనమంతా ఒకే ప్రయోజనం కోసం జీవితం గడపాలి. అది తాత్కాలికమైనది, నశించిపోయేది, పరిమితమైనది కారాదు. ఆ ప్రయోజనం శాశ్వతమైనది, నాశనం లేనిది, అపరిమితమైన ప్రయోజనం కోసం ఏకం కావాలి. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి ఈప్రయోజనాన్ని పొందాలని కోరితే, అతడి ఇష్టానికి అనుగుణంగా పొందే వీలుండాలి. ఈ ప్రయోజనం ఎవరికీ అలభ్యంగా ఉండరాదు. నేడు ప్రపంచంలో నలువైపులా స్వార్థం, ధనపూజ కనబడుతున్నాయి. ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం ప్రాపంచిక ప్రయోజనాలకై తపిస్తున్నాడు. సమస్త ప్రపంచ సంపదలు తనకే రావాలని అనుకొంటున్నాడు. విశ్వంలో ఉన్న భౌతిక వనరులు, సమస్త మానవులకు వారసత్వంగా లభించాయి. ఈ కొద్దిపాటి వనరుల కోసం బలవంతుడు తన బలం ఉపయోగించి పొందాలని ప్రయత్నిస్తే జాతుల మధ్య పరస్పర సంఘర్షణ తప్పనిసరి అవుతుంది. అందువల్లనే అగ్రరాజ్యాల మధ్య సంఘర్షణ. దీనికి కూడా గతంలోని ప్రపంచ యుద్ధాల వలెనే భౌతికవాదం, స్వార్థాల కారణాలు, పేదవాళ్ళు ధనవంతులపై, కార్మికులు

పెట్టుబడిదారులపై, కర్షకులు భూస్వాములపై, బలహీన దేశాలు శక్తిమంతమైన దేశాలపై పరస్పర ద్వేషాల ప్రాతిపదికన చేతులు కలుపుతున్నారు. తమ న్యాయబద్ధమైన హక్కులు కూడా లాక్కోన్నారని ఆగ్రహిస్తున్నారు. ఈ కారణాన ప్రపంచ శాంతికి మరో ప్రమాదం ఎదుర్కోవలసి వస్తోంది. ప్రపంచంలోని పరిమిత వనరులు ఈ స్వార్థపూరిత వైఖరులకు సరిపోవు. అందువల్ల యుద్ధాలపై యుద్ధాలు జరుగుతున్నాయి. సమస్త ప్రపంచం ఒక ఆర్థిక సంక్షోభంలో మునిగి ఉంది. అన్ని వైపులా అసంతృప్తి, అశాంతి, భయం, దురాశ అలుముకొని ఉన్నాయి. ప్రపంచం పూర్తిగా నాశనమైపోతుందా అనిపించేలా ఉంది. అయితే, ముందుచెప్పిన ఒకే లక్ష్యం, ఒకే ప్రయోజనం అన్న నియమాన్ని గనుక అంగీకరిస్తే ఈ సమస్త సమస్యలు సంపూర్ణంగా పరిష్కృతమైపోతాయి. ఎందుకంటే ఆ ప్రయోజనం పరిమితమైన, తాత్కాలికమైన ప్రాపంచిక ప్రయోజనం కాదు. అది శాశ్వతమైన, నశించని, అపరిమితమైన పరలోక ప్రయోజనం. ఇది ప్రతి వ్యక్తికి తెలుసు. ప్రతి వ్యక్తి ఈ ప్రయోజనాన్ని పొందగలడు. ఈ ప్రయోజనం పొందే ప్రయత్నాల వల్ల విద్వేషం శత్రుత్వం తలెత్తుతాయని ఏ వ్యక్తీ భయపడవలసిన పని లేదు. పరలోకం- ఇస్లామీయ బోధనల ప్రకారం మరణానంతరం ఒక అంతం లేని జీవితం ఉంది. అక్కడి వనరులు, సాధనాలు అపరిమితమైనవి. అక్కడ దైవానుగ్రహం అపారం. అక్కడి సౌభాగ్యాలతో పోల్చితే ఇక్కడి ఇహలోక సౌభాగ్యాలు అత్యల్పం. దైవాధికారాన్ని అంగీకరించిన వారికి, మానవాళికి సేవ చేసిన వారికి, దైవ ప్రసన్నత కోసం తమ దైవ దాస్యాన్ని పాటించి దైవాదేశాల ప్రకారం జీవితాన్ని గడిపిన వారికి ఈ సౌభాగ్యాలు లభిస్తాయి. ప్రాపంచిక ప్రయోజనాలతో పోల్చితే పరలోక ప్రయోజనాలు అత్యంత విశ్వసనీయమైనవి. ప్రపంచంలోని సమస్త మానవులు ఈ వాస్తవంపై సునాయాసంగా ఒక్కటి కాగలరు. స్వార్థం, ధనపూజ నాశనం కాగలవు. ఈ విధంగా ప్రపంచాన్ని నరకంగా మార్చిన ఓ అతి పెద్ద సమస్య పరిష్కృతం కాగలదు. అయితే ఇక్కడ ప్రస్తావించడం అవసరమనుకొంటున్నాను. పరలోకమన్నది కేవలం ఒక ఊహాలోకం కాదు. ఇది వాస్తవం. ఈ లోకాన్ని

మనలో ఎవ్వరూ చూడకపోయినప్పటికీ, మన కళ్ళతో ప్రస్తుతం ఆ లోకాన్ని చూడడం సాధ్యంకానప్పటికీ, ఈ లోకం గురించిన వాస్తవాన్ని, దాన్ని చూసిన వర్గం ప్రపంచానికి చాటింది. ఆ వర్గం వారి నీతి, నిజాయితి, సత్యసంధత, సద్వర్తనాలను వారి శత్రువులు కూడా వేలెత్తి చూపలేకపోయారు. పైగా ఎల్లప్పుడు కొనియాడారు. ఈ వర్గం- ఇస్లామీయ పరిభాషలో ప్రవక్తలు. మనం ఇంట్లో కూర్చొని కూడా అనేక విషయాలను ప్రచార ప్రసార సాధనాల ద్వారా తెలుసుకొని ఒప్పుకొంటున్నాం. అందులో అనేకవాటిని అవి నిజంగా ఉన్నప్పటికీ మనం కళ్ళతో చూసే ఉండము. అలాంటప్పుడు జీవితాంతం ఎన్నడూ ఏ విషయంలోనూ అసత్యం చెప్పని వారిగా ప్రసిద్ధికెక్కిన ప్రవక్తలు చెప్పిన మాటలను మనం ఎందుకు అంగీకరించరాదు? పైగా పరలోక భావన మనలను బాధ్యతాయుతమైన జీవనం గడిపేలా చేసే భావన. ప్రతి చెడు నుంచి కాపాడే భావన. సామాజిక చెడులనే కాదు, ఒంటరిగా, చీకట్లలోనూ వ్యక్తి చెడులకు పాల్పడకుండా నిరోధించగలదు. ఈ భావన పునాదులపై మనిషి ఎల్లప్పుడు మంచినే ఆచరిస్తాడు. ఈ భావనవల్ల మనిషి తాను మరణించాక దైవం ముందు హాజరు కావలసి ఉందని, తన ప్రతి పనికి, ప్రతి ఆచరణకు, ప్రతి మాటకు, ప్రతి ఆలోచనకు సమస్త జీవితానికి జవాబు చెప్పవలసి ఉంటుందని భావిస్తాడు. బాధ్యతాయుతమైన జీవనం గడపడానికి, ప్రతి చెడు నుంచి దూరంగా ఉండడానికి, వ్యక్తిగత, సామాజిక జీవనాన్ని నైతిక నియమావళి రీత్యా గడపడానికి, ఎల్లప్పుడూ మంచి పనులు చేయడానికి తోడ్పడే ఇలాంటి భావనను నేటి వరకు ప్రపంచం రూపొందించ గలిగిందా? లేదు. ప్రభుత్వాల బలం చేయలేని పనిని పరలోక భావన సాధించగలదు. ఈ భావన మానవ జీవితానికి పునాది రాయి వంటిది. ఇది అన్నిటికన్నా మించిన మౌలిక వాస్తవం. దీన్ని తిరస్కరిస్తే సమస్త వాస్తవికతలను కుప్పకూల్చడమే అవుతుంది.

సోదరులారా!

మీరు ఇస్లామీయ నియమాలను తెలుసుకొన్నారు. ఒకే అధికారం, ఒకే మానవాళి, ఒకే జీవన వ్యవస్థ, ఒకే ఆదర్శం, ఒకే లక్ష్యం- అన్న

నియమాలపై ఆధారపడిన ఇస్లాం ఏ విధంగా సమాజ నిర్మాణాన్ని సరికొత్తగా చేయగలదో చూశారు. జీవిత సమస్యలు ఎలా పరిష్కరించగలదో తెలుసుకొన్నారు. ఈ సిద్ధాంతం వల్ల అశాంతి, అలజడి, అసంతృప్తి, కల్లోలం సమాప్తమవుతాయి. ప్రపంచంలో శాంతి సుహృద్భావాలు సామరస్యం నెలకొంటాయి. ఆఖరున మరో మాట చెప్పడం అవసరమనుకొంటున్నాను. ఇప్పటి వరకు చెప్పినదాంట్లో ప్రస్తుత సమస్యలకు ఇస్లామీయ పరిష్కారాన్ని మాత్రమే చూపడం జరిగింది. ఇది కేవలం సిద్ధాంతం లేక ఊహాగానం కాదు. ఇది ఒక చారిత్రక వాస్తవం. నేటికి పధ్నాలుగు వందల సంవత్సరాల పూర్వపు చరిత్రను కనుక మీరు అధ్యయనం చేస్తే, అప్పట్లో కూడా సమస్త ప్రపంచం ముఖ్యంగా అరబ్బు ప్రపంచంలో నేటి వలెనే సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు తీవ్రతరమయ్యాయి. ఆనాడు కూడా నైతిక పతనం ఉండేది. జాతి వైరాలు ఉండేవి. తెగలు ఒకదాని రక్తం మరొకటి తాగాలని చూస్తుండేవి. పగ ప్రతీకారాలు ఏళ్ళ తరబడి రగులుతూ ఉండేవి. యూదుల వడ్డీ, పెట్టుబడిదారీ విధానాలు దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో ముంచేశాయి. నేటి సమస్యలకు, నాటి సమస్యలకు కొన్ని భేదాలున్న మాట నిజమే. నేటి సమస్యలు అతి విస్తారమైనవి. కాని స్వభావం రీత్యా నాడు నేడు సమస్యలు ఒకేలాంటివి. మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ కొత్త సమాజాన్ని పై అయిదు నియమాల పునాదులపై ప్రతిపాదించిన కొన్ని సంవత్సరాలలోనే ఒక శ్రేయస్కర సమాజం ఉనికిలోకి వచ్చింది. దీనికి చరిత్రయే సాక్ష్యం. నైతికత ఏమిటో ఎరుగని అరబ్బులు ప్రపంచానికి నైతిక పాఠాలు నేర్పే ఎత్తుకు ఎదిగారు. జాత్యాహంకారంతో తెగల వైరంతో ఒకరి కుత్తుకలు కోయాలని మరొకరు ఎల్లప్పుడు ఎదురు చూస్తుండే అరబ్బులలో సాటిలేని రాజకీయ సమైక్యత సాధ్యమయ్యింది. పరస్పర ద్వేషం, శత్రుత్వం, సమసిపోయి వాటిస్థానే సానుభూతి, స్నేహం చోటుచేసుకొన్నాయి. వాళ్ళు తమ ఆడశిశువులను సజీవంగా సమాధి చేసే క్రూరులుగా ఉండేవారు- నేడు బర్త్ కంట్రోల్ అన్న నాగరిక పదం మాటున పిల్లలను పుట్టకముందే చంపుతున్నట్లు- మారిపోయి ఆడ శిశువులను అత్యుత్తమంగా పెంచి

పోషించేవారిగా మారారు. కనీసం నాగరికంగా బ్రతకడం కూడా తెలియని వాళ్ళు, సామాజిక పద్ధతులను ప్రపంచానికి నేర్పే స్థాయిని అందుకొన్నారు. ఆర్థిక రంగంలో వడ్డీ, దోపిడి, అక్రమాలలో మునిగి ఉండే వాళ్ళు అత్యంత నిజాయితీపరులైన వ్యాపారులుగా మారారు. వారి ఆచరణాత్మక జీవనంలో అత్యున్నత మార్పులు చోటు చేసుకొన్నాయి. వాళ్ళు అతి నీచ పరాభవాల స్థాయి నుంచి లేచి, అధికారాసనాలను ఆక్రమించు కొన్నారు. అయినా అధికార మత్తులో మునిగిపోలేదు. లక్షలాది ప్రజల పాలకులయ్యారు కాని, ఎల్లప్పుడు తమకు తాము ప్రజల సేవకులుగా భావించారు. ఆకలిదప్పుల జీవితం నుంచి రోమ్, ఈరాన్ సామ్రాజ్యాల ఆధిపత్యానికి ఎదిగినప్పటికీ, అప్పుడు కూడా సంపద, అధికారాల పిపాస వారి హృదయాల్లో స్థానం పొందలేకపోయింది. లక్షలాది, కోట్లాది రూపాయల సంపద వారి చేతుల్లో వస్తున్నప్పటికీ, ఖీసర్, కస్రా ప్రభుత్వాల ఖజానాల నుంచి ఇస్లామీయ ప్రభుత్వానికి వచ్చిన కప్పంతో ధనాగారం పొంగిపొరలు తున్నప్పటికీ, వాళ్ళు దానిలో నుంచి ఒక్క రూకను కూడా తాకలేదు. తమ అవసరాలకు సరిపడి నంత మాత్రమే తీసుకొన్నారు. మిగిలింది అవసరార్థులకు, ప్రజల శ్రేయో సౌభాగ్యాల కోసం ఖర్చు చేశారు. న్యాయస్థానంలో న్యాయ మూర్తులుగా కూర్చున్నప్పుడు, అప్పటి ఖలీఫా అయినా సరే దోషం చేసినట్లయితే న్యాయబద్ధంగా తీర్పు వినిపించారు. సైన్యాలకు నాయకులై నడిపించి నప్పటికీ, బలగర్వంతో శక్తిని తప్పుడు పనులలో వాడలేదు. అంతర్జాతీయ రాజకీయాల కళ్ళెం తమ చేతుల్లోకి తీసుకొన్నప్పటికీ నీతి, నిజాయితీలను ఎల్లవేళలా పాటించారు. చివరకు చెప్పేదేమిటంటే పై అయిదు నియమాల పునాదులపై ఒక నూతన సమాజం ఉనికిలోకి వచ్చింది. అది శాంతి భద్రతల సమాజం. ఆ సమాజ ప్రభావం ఎంత వరకు వ్యాపించిందో అంతవరకు సుఖశాంతులు విస్తరించాయి. ఈ వాస్తవాన్ని ముస్లిములే కాదు నిష్పాక్షికంగా ఆలోచించే ముస్లిమేతర మేధావులు కూడా అంగీకరించారు. మేము ఇక్కడ భారతదేశంలోని ప్రముఖ వ్యక్తి గాంధీజీ 1937లో వ్యక్తీకరించిన అభిప్రాయాన్ని మాత్రం ఇస్తున్నాము. కాంగ్రెసు మంత్రులతో ఆయన ఈ అభిప్రాయాన్ని

వెలిబుచ్చేవారు. భారతదేశ ప్రభుత్వాన్ని 'ఖిలాఫత్-యె-రాషిదా' అడుగు జాడల్లో నడవడాన్ని, కాంగ్రెసు మంత్రులు హజరత్ సిద్దీఖ్-యె-అక్బర్ (రజి), ఫారూఖ్-యె-ఆజమ్ లాంటి అత్యున్నత వ్యక్తులను అనుసరించేలా చూడాలనుకొంటున్నానని గాంధీజీ అనేవారు. ఏది ఏమైనా ఎవరు ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా, సూర్యుడు సూర్యుడే. సూర్యుడి నుంచి వెలుతురు లభిస్తుంది. చీకటి కాదు. నేడు కూడా ఆ నియమాలపై నూతన సమాజాన్ని నిర్మించ ప్రయత్నం చేస్తే, మళ్ళీ ప్రపంచం శాంతి భద్రతల నిలయం కాకపోవడానికి కారణమేదీ కనిపించదు. సూర్యుడు ఉదయిస్తాడని ఎంత ఖచ్చితంగా చెప్పగలమో, అంతకన్నా ఎక్కువగా గ్యారంటీతో ఇస్లాం ప్రతి పాదించే నియమాలు లేకుండా ప్రపంచం కల్లోల నిలయంగానే ఉంటుందని చెప్పవచ్చు.